Follow: @ANNTELUGU

23-05-2026

# మహా పత్రిక

ANN తెలుగు

శనివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 146 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## అమెరికా ఇరాన్ శాంతి ఒప్పందం

- మరికొన్ని గంటల్లో ప్రకటించే అవకాశం
- ప్రపంచానికి ఊరటనిచ్చే అంశమంటున్న సౌదీమీడియా

**మహా :** ప్రపంచమంతా ఎదురుచూస్తున్న యుద్ధవిరమణపై ఆసక్తికర ప్రకటన రాబోతుందన్న చర్చ అంతర్జాతీయ మీడియాలో జరుగుతోంది. అమెరికా ఇరాన్ ప్రతిపాదిత శాంతి ఒప్పందం తుది ముసాయిదాపై ఇంకొన్ని గంటల్లోగా ప్రకటన వెలువడుతుందంటూ సౌదీ అరేబియా ప్రభుత్వ టీవీ ఛానల్ సంచలన కథనాన్ని ప్రసారం చేసింది. ఈ ఒప్పందపు వ్యవహారాలతో సంబంధమున్న వర్గాల నుంచి దీనిపై సమాచారం లభించిందని కథనంలో పేర్కొన్నారు. ఆయా వర్గాలు ఇచ్చిన సమాచారం ప్రకారం,

మిగితా 2వ పేజీలో

టాప్ న్యూస్

### ఫ్యూచర్ సిటీ'ని రద్దు చేస్తాం


- మాజీ మంత్రి హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు.



03

### బీఆర్ఎస్ నే ప్రజలు రద్దుచేస్తారు

- హరీష్ రావుపై ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఫైర్
- ఫ్యూచర్ సిటీతో భవిష్యత్ కు బంగారు బాట



02

### కిషన్ రెడ్డి దావత్ ఆసక్తికర చర్చ



02



## ఐఏఎస్ అధికారుల పిల్లలకు మళ్లీ రిజర్వేషన్లు ఎందుకు?

- క్రీమీ లేయర్'పై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు
- దేశవ్యాప్తంగా చర్చ

**ఢిల్లీ, మహా :** విద్యా, ఆర్థిక పురోగతితో సామాజికంగా ఉన్నత స్థాయికి చేరుకున్న కుటుంబాలు.. తరతరాలుగా రిజర్వేషన్ల ప్రయోజనాలను ఆశించడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. తల్లిదండ్రులు ఐఏఎస్ అధికారులైనప్పుడు, వారి పిల్లలకు మళ్లీ రిజర్వేషన్లు కోరడంలో అర్థం లేదని అత్యున్నత న్యాయస్థానం కుండబద్దలు కొట్టింది. ఇలాగైతే మనం రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేమని వ్యాఖ్యానించింది. వెనుకబడిన తరగతుల్లోని 'క్రీమీ లేయర్'

మిగితా 2వ పేజీలో

# అమోయ్ కుమార్‌కు ఈడీ సమన్లు

- ఈనెల 25న విచారణకు హాజరుకావాలని ఆదేశం
- రంగారెడ్డి టూ ఖమ్మం.. వందల కోట్ల భూదందా
- పేదల నోళ్లు కొట్టి బడా బాబులకు కట్టబెట్టిన వైనం
- సూత్రధారుల గుండెల్లో రైళ్ళు.. సేల్ డీడ్ల వెనుక రహస్యాలు
- బయటపడుతున్న బడాబాబుల కాసుల బాగోతాలు



**హైదరాబాద్, మహా :** వివాదాస్పద అవినీతి అధికారిగా పేరున్న అమోయ్ కుమార్ కు ఈడీ సమన్లు జారీచేసింది. ఈ నెల 25న జరిగే కీలక విచారణకు మూడు ముఖ్యమైన సేల్ డీడ్ పత్రాల సంపూర్ణ వివరాలతో హాజరుకావాలని ఈడీ అమోయ్ కుమార్‌ను ఆదేశించింది. ఈ మూడు పత్రాల్లో ఒకదానికి ఖమ్మం జిల్లా పరిధిలోని ఒక బడా లావాదేవీతో అంతర్గత సంబంధం ఉందనే అనుమానాలున్నాయి. గతంలో సదరు ఉన్నతాధికారి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పనిచేసిన కాలంలోనే, ఖమ్మంకు చెందిన కొందరు బడా రాజకీయ నేతలు, రియల్టర్లు అక్కడ పెద్ద ఎత్తున భూదందాలు సాగించారు. దానికి ప్రతిఫలంగా ఖమ్మం వెలుగుమట్ల పరిధిలోని కొన్ని వివాదాస్పద భూముల్లో బినామీ పెట్టుబడులు చేతులు మారాయనే ఘాటున చర్చ సాగుతోంది. రంగారెడ్డి జిల్లాలో అనేకమంది రాష్ట్ర నేతలు, ప్రముఖులకు అక్రమార్గంలో ఉదారంగా పంచారని, పంచుకుతిన్నారనే అపవాదు ఉంది. ఈడీ ఈ మనీ లాండరింగ్ మూలాలను గట్టిగా లాగితే హైదరాబాద్, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాకు చెందిన కొందరు ప్రజాప్రతినిధులు కూడా బోనులో నిలబడక తప్పదనే చర్చ ఉంది.

**అధికారవర్గాల్లో ప్రకంపనలు**

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న భూదాన్ భూముల కుంభకోణం వ్యవహారం రాజకీయ, అధికార వర్గాల్లో ప్రకంపనలు రేపుతోంది. ఆచార్య వినోబాభావే నాడు పేద ప్రజల సాగు, గూడు కోసం సేకరించిన పవిత్రమైన భూదాన్ భూములను, కొందరు రికార్డుల మాయాజాలంతో ప్రైవేటు శక్తులకు కట్టబెట్టడంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గట్టి నిఘా పెట్టింది. ఈ క్రమంలోనే వివాదాస్పద ఐఏఎస్ అధికారి అమోయ్ కుమార్‌కు ఈడీ సమన్లు జారీ చేయడం, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం భూములపై దర్యాప్తును ముమ్మరం చేయడంతో.. దీని అంతర్గత లింకులు ఖమ్మం నగర పరిధిలోని అత్యంత విలువైన వెలుగుమట్ల భూదాన్ భూముల వైపు లాగుతున్నాయి. ఒకే రకమైన వ్యూహంతో సాగిన ఈ భూ దోపిడీ వెనుక ఉన్న బడా బాబుల గుట్టు రట్టు చేసేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థ రంగం సిద్ధం చేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

**మహేశ్వరం కేసుతో కదులుతున్న మూలాలు**

హైదరాబాద్ సమీపంలోని రంగారెడ్డి జిల్లా మహేశ్వరం పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రిమినల్ కేసుల ఆధారంగా ఈడీ ప్రస్తుతం తన దర్యాప్తును వేగవంతం చేసింది. అక్కడ సుమారు 42 ఎకరాల అత్యంత విలువైన భూదాన్ భూములను నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తులకు బదలాయించారనే ఆరోపణలపై గతంలోనే ఐఏఎస్ అధికారి అమోయ్ కుమార్‌ను అధికారులు ప్రశ్నించారు. అయితే, ఈ వ్యవహారంలో కేవలం మహేశ్వరానికే పరిమితం కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా ఒకే రకమైన వ్యూహంతో భూములు చేతులు మారాయని ఈడీ ప్రాథమికంగా గుర్తించింది. దీంతో ఈ విచారణ పరిధి విస్తరిస్తే, రాష్ట్రంలోనే అత్యంత వివాదాస్పదంగా మారిన ఖమ్మం వెలుగుమట్ల పరిధిలోని సర్వే నంబర్ల ఫైళ్లు కూడా

మిగితా 2వ పేజీలో



## రాజ్యసభ రేస్

- ఏపీలో 4 స్థానాలు.. దేశవ్యాప్తంగా 24స్థానాలకు ఎన్నిక
- షెడ్యూల్ రిలీజ్ చేసిన ఈసీ
- టీడీపీకి 2, బీజేపీ,జనసేనలకు చెరొకటి తీసుకునే ఛాన్స్
- రేసులో హేమాహేమీలు.. సిట్టింగ్ ఎంపీ సానా సతీష్ కు రెన్యువల్ ఛాన్స్

**అమరావతి, మహా** రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల అయింది. ఏపీ తో సహా దేశ వ్యాప్తంగా 24 స్థానాలకు ఈ ఎన్నికలు జరగనున్నాయి. జూన్ 1 నోటిఫికేషన్.. వచ్చే నెల 18న అవసరమైన రాష్ట్రాల్లో పోలింగ్ జరగనుంది. ఏపీ, కర్ణాటక, గుజరాత్ నుంచి నాలుగు స్థానాల మేర ఎన్నికలు జరగనున్నాయి. ఏపీలో నాలుగు స్థానాలు ఖాళీ అవుతున్నాయి. ఇప్పటికే ఈ స్థానాల్లో పోటీ.. అభ్యర్థుల పైన కూటమి నేతలు ఒక అంగీకారానికి వచ్చారు. మూడు పార్టీలు తమ అభ్యర్థుల విషయంలో

మిగితా 2వ పేజీలో



## ఆకునూరి మురళి రిజైన్

**తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ పదవికి రాజీనామా**

**హైదరాబాద్, మహా :** తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి తన పదవికి రాజీనామా చేశారు. మురళి హఠాత్ నిర్ణయం వెనుక కీలక అంశం ఉంటుందని అందరూ భావిస్తున్నారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అయిన ఆకునూరి మురళిని తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ పదవిని ఇచ్చింది. అయితే తెలంగాణ విద్యా శాఖలో తీసుకురావాల్సిన సంస్కరణలకు సంబంధించి.. ఆకునూరి మురళి నేతృత్వంలోని బృందం గత కొన్ని రోజుల క్రితమే రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తూ పలు కీలక సిఫార్సులను సూచించింది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఆయన తన పదవికి రాజీనామా చేయడం గమనార్హం.

మిగితా 2వ పేజీలో




## సెక్రటేరియట్ వద్ద కవిత మెరుపు ధర్నా

రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్

02



## బెజవాడలో జీప్ వార్

- యువతి కోసం స్ట్రీట్ ఫైట్
- నడిరోడ్డుపై పరుగులు తీసిన జనం

02



## ప్రభుత్వ భూములకు డిప్యూటీ కలెక్టర్ ఎసరు

- ఏసీబీ తనిఖీల్లో రూ.వందల కోట్ల ఆస్తులు
- మేడ్చల్ డిప్యూటీ కలెక్టర్ వంశీమోహన్ నిర్వాకం

మేడ్చల్, మహా : మేడ్చల్ మల్కాజిగిరి డిప్యూటీ కలెక్టర్ వంశీమోహన్ అవినీతి బాగోతం బయటికి వచ్చింది. ఏసీబీ అధికారులు నిర్వహించిన సోదాల్లో వందల కోట్ల రూపాయల విలువైన ఆస్తులు గుర్తించారు. శేరిలింగంపల్లి సహా పలు ప్రాంతాల్లో ఆర్డీవోగా పనిచేసిన వంశీమోహన్ భారీగా ప్రభుత్వ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసుకున్నట్లు సంచలన ఆరోపణలు ఉన్నాయి. అబ్దుల్లాపూర్‌మెట్, పిగ్లీపురం ప్రాంతాల్లో 8 ఎకరాల ప్రభుత్వ భూమిని వంశీమోహన్ కాజేసినట్టు ఆరోపణలు

మిగితా 3వ పేజీలో

## రూ. 60 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడిన రెవెన్యూ అధికారులు

02



## దమ్ముంటే అసెంబ్లీ రద్దు చేసి ఎన్నికలకు రా.

- పోక్సో నిందితుడికి సీఎం రక్షణ.
- ధాన్యం కొనుగోళ్లలో సర్కార్ విఫలం.
- గన్నీ బ్యాగులు లేవు కానీ గన్నులు దొరుకుతున్నాయి.
- కాంగ్రెస్, బీజేపీల తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్.



03



# అమోయ్ కుమార్ కు ఈడీ సమన్లు

**మొదటి పేజీ తరువాయి**

ఈడీ రాడార్‌లోకి రావడం ఖాయమనే సంకేతాలు వెలువడుతున్నాయి.

వెలుగుమట్లలో సాగిన రికార్డుల మాయాజాలం

ఖమ్మం నగరానికి ఆనుకుని ఉండి, నేడు వందల కోట్ల రూపాయల విలువ పలికే వెలుగుమట్ల రెవెన్యూ పరిధిలోని భూదాన్ భూములు గత కొన్నేళ్లుగా వివాదాల సుడిగుండంలో ఉన్నాయి. భూదాన్ బోర్డులోని అసలు రికార్డులను మాయం చేయడం లేదా నిబంధనలను తమకు అనుకూలంగా మార్చేయడం ద్వారా ఇక్కడి భూములను కొల్లగొట్టారు. ఉన్నతాధికారుల ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ రూలింగ్స్‌ను, వివాదాస్పద కోర్టు ఆర్డర్లను అడ్డం పెట్టుకుని రాత్రికి రాత్రే బినామీల పేరిట రెవెన్యూ రికార్డులను సృష్టించారు. నాటి పేద రైతులను, స్థానికులను దౌర్జన్యంగా ఖాళీ చేయించి, ఆ స్థలాల్లో రాత్రికి రాత్రే ప్రైవేటు రియల్ ఎస్టేట్ వెంచర్లు, కమర్షియల్ ప్రాజెక్టులు వెలిసేలా చేశారనే బలమైన ఆరోపణలు వెలుగుమట్ల పరిధిలో స్పష్టంగా కనిపిస్తున్నాయి.

**ఖమ్మం ప్రభుత్వ ఆఫీసుల్లో కలవరం**

హైదరాబాద్ వేదికగా ఈడీ తన పట్టును బిగించడంతో ఖమ్మంలోని కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ, ప్రైవేటు రియల్ ఎస్టేట్ ఆఫీసుల్లోనూ గుసగుసలు మొదలయ్యాయి. వెలుగుమట్ల పరిధిలో గతంలో వివాదాస్పదంగా మారిన సర్వే నంబర్ల ఫైళ్లను, కోర్టు ఆదేశాల పేరిట ఇచ్చిన మ్యుటేషన్ల రికార్డులను కొందరు అధికారులు రహస్యంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈడీ దర్యాప్తు పరిధి కేవలం ఒక్క ప్రాంతానికే పరిమితం కాదని, 'భూదాన్' పేరుతో ఎక్కడెక్కడ మనీ లాండరింగ్ జరిగిందో వాటన్నింటినీ లాగుతామని స్పష్టం చేయడంతో వెలుగుమట్ల



భూబకాసురుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. రానున్న రోజుల్లో ఈ కేసు ఎలాంటి మలుపులు తిరగబోతుందో, ఎందరి జాతకాలు బయటపడతాయోనని జిల్లా వ్యాప్తంగా సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. భూదాన్ భూముల పరిరక్షణ కోసం దశాబ్దాలుగా పోరాడుతున్న హక్కుల సంఘాలు, బాధితులు ఇప్పుడు ఈడీ రంగంలోకి దిగడాన్ని స్వాగతిస్తున్నారు. మహేశ్వరం భూముల దర్యాప్తు వెలుగుమట్ల అక్రమాలను వెలికితీయడానికి ఒక తాళంచెవిలా మారుతుందని బాధితులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థ ఈ కేసులో కేవలం అధికారులనే కాకుండా, వారి వెనుక ఉండి నడిపించిన అసలు సూత్రధారులను, రాజకీయ పెద్దలను టార్గెట్ చేస్తేనే పేదలకు న్యాయం జరుగుతుంది. ఈ నెల 25న జరగబోయే విచారణ తర్వాత వెలువడే మరిన్ని నిజాలు, బ్యూరోక్రసీ మరియు రాజకీయ వర్గాల్లో ఎలాంటి సంచలనాలకు దారితీస్తాయో వేచి చూడాలి.

# ఐఏఎస్ అధికారుల పిల్లలకు మళ్లీ రిజర్వేషన్లు ఎందుకు?

**( మొదటి పేజీ తరువాయి )**

సంపన్న (శ్రేణి) వర్గాలను కోటాల నుంచి మినహాయించడానికి సంబంధించిన నిబంధనలపై దాఖలైన పలు పిటిషన్లను శుక్రవారం జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా కోర్టు సామాజిక న్యాయం, రిజర్వేషన్ల అమలు తీరుపై పలు కీలక, సంచలన వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న మాట్లాడుతూ.. "తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులై, ప్రభుత్వ సర్వీసుల్లో అత్యున్నత స్థానాల్లో ఉన్నప్పుడు.. వారిలో సామాజిక పురోగతి ఆర్థిక అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తుంది. విద్యా, ఆర్థిక సాధికారతతో ఒక స్థాయికి చేరుకున్న తర్వాత కూడా వారు తమ పిల్లలకు రిజర్వేషన్లు కావాలని కోరుకుంటే, ఈ వ్యవస్థ నుండి మనం ఎప్పటికీ బయటపడలేం. ఇది తీవ్రంగా ఆలోచించాల్సిన విషయం" అని వ్యాఖ్యానించారు. ఒక తరం రిజర్వేషన్ల ద్వారా ఉన్నత స్థాయికి చేరుకున్న తర్వాత, వారి తదుపరి తరాలకు కూడా అదే ప్రయోజనాలు కల్పించడం 'క్రీమీ లేయర్' నిబంధనలకే విరుద్ధమని ధర్మాసనం అభిప్రాయపడింది. ఒక కుటుంబంలో రిజర్వేషన్ల అండతో ఉన్నత స్థాయికి వెళ్లిన వారే పదే పదే అదే ఫలాలను చేజిక్కించుకుంటే.. అదే వర్గంలో అసలైన, అత్యంత పేదరికంలో మగ్గుతున్న వారికి తీరని అన్యాయం జరుగుతుందని కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. వ్యవస్థలో ఖచ్చితంగా కొంత సమతుల్యత ఉండాలని, కోటా ప్రయోజనంతో తల్లిదండ్రులు ఉన్నత స్థానాలకు వెళ్లినప్పుడు వారి పిల్లల సామాజిక, ఆర్థిక పరిస్థితులు పూర్తిగా మారిపోతాయని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. రిజర్వేషన్ల ఫలాలు కేవలం కొందరికే పరిమితం కాకుండా, సమాజంలోని ఆఖరి వ్యక్తికి అందాలన్నదే అసలైన లక్ష్యం కావాలని సూచించారు.

**ఈడబ్ల్యూఎస్ , క్రీమీ లేయర్ వేర్వేరు**

ఈ విచారణలో పిటిషనర్ల తరపు న్యాయవాది వాదిస్తూ.. వ్యక్తులను వారి జీతం ఆధారంగా కాకుండా కేవలం హోదా (స్టేటస్) ఆధారంగా రిజర్వేషన్ల నుంచి మినహాయించడంపై లోతైన పరిశీలన అవసరమని కోరారు. క్రీమీ లేయర్ ప్రమాణాలు ఆర్థికంగా వెనుకబడిన వర్గాల కేటగిరీ కంటే చాలా సరళంగా ఉండాలని వాదించారు. దీనికి జస్టిస్ నాగరత్న స్పందిస్తూ.. ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో సామాజిక వెనుకబాటుతనం ఉండదని, దానికి కేవలం ఆర్థిక వెనుకబాటుతనం మాత్రమే కొలమానమని తేల్చిచెప్పారు. కానీ క్రీమీ లేయర్ అనేది కుల ఆధారిత సామాజిక వెనుకబాటుతనానికి, ఆర్థిక హోదాకు ముడిపడి ఉన్న అంశమని స్పష్టం చేశారు. అనంతరం, ఈ పిటిషన్లపై కేంద్ర ప్రభుత్వంతో పాటు ఇతర సంబంధిత పక్షాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసి, తదుపరి విచారణను వాయిదా వేసింది.



**నేపథ్యం - ఇంద్ర సాహ్నీ తీర్పు**

1992లో సుప్రీంకోర్టు వెలువరించిన చారిత్రాత్మక 'ఇంద్ర సాహ్ని' (మండల్ కమిషన్) తీర్పులో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లను సమర్థిస్తూనే.. వారిలోని 'క్రీమీ లేయర్' వర్గాలను మినహాయించాలని ఆదేశించింది. ప్రస్తుత ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. వరుసగా మూడేళ్ల పాటు వార్షిక ఆదాయం రూ. 8 లక్షలు దాటిన వారితో పాటు; ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులు, ఉన్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు, సైన్యంలో కల్నల్ ఆ పై స్థాయి అధికారుల పిల్లలను, వారి ఆదాయంతో సంబంధం లేకుండా క్రీమీ లేయర్‌గా పరిగణిస్తూ రిజర్వేషన్ల నుంచి మినహాయిస్తున్నారు. ఇప్పుడు సుప్రీంకోర్టు చేసిన తాజా వ్యాఖ్యలతో దేశవ్యాప్తంగా రిజర్వేషన్ల హేతుబద్ధతపై మరోసారి చర్చ మొదలైంది.



# సెక్రటేరియట్ వద్ద కవిత మెరుపు ధర్నా

**రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్**

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్ర సచివాలయం ముట్టడికి యత్నించిన తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతో పాటు ఆ పార్టీ శ్రేణులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే కొనుగోలు చేయాలని, ధాన్యంలో తరుగు పేరిట క్వింటాకు కిలోల కొద్దీ కోత విధిస్తూ రైతులను నిలువునా ముంచేసే విధానాన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేస్తూ కవిత ఆధ్వర్యంలో శుక్రవారం సెక్రటేరియట్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. సచివాలయం ముందు పెద్ద ఎత్తున చేరిన టీఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, రైతులకు మద్దతుగా నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. దీంతో అక్కడ ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ధర్నా చేస్తున్న కవితతో పాటు ఇతర ముఖ్య నాయకులను, మహిళా కార్యకర్తలను పోలీసులు దుపులోకి తీసుకున్నారు. వారిని పోలీస్ వాహనాల్లో అక్కడి నుంచి పోలీస్ స్టేషన్‌కు తరలించారు

# రాజ్యసభ రేస్

దాదాపు నిర్ణయానికి వచ్చేసారు. బీజేపీ.. జనసేన నుంచి అభ్యర్థుల పై అనూహ్య ఎంపిక జరగనుంది.

**ఏపీ ఎంపికలపై ఆసక్తి**

ఏపీ నుంచి రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక పైన కసరత్తు జరుగుతోంది. ప్రస్తుతం వైసీపీ సభ్యులుగా ఉన్న పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పరిమళ్ నత్వానీతో పాటు సానా సతీష్ పదవీ కాలం వచ్చే నెలతో ముగుస్తోంది. కూటమిలోని మూడు పార్టీలు ఈ నాలుగు సీట్ల పైన ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అందులో భాగంగా టీడీపీకి రెండు, జనసేన బీజేపీకి చెరో సీటు కేటాయించ నున్నారు. ఇప్పటికే ఆశావాహులు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా.. టీడీపీ జనసేన నుంచి దక్కే మూడు స్థానాల్లో సామాజిక సమీకరణాలు కీలకంగా మారనున్నాయి. అందులో భాగంగా సిట్టింగ్ ఎంపీ సానా సతీశ్ కు రెన్యువల్ చేయటం ఖాయంగా కనిపిస్తోంది. బీసీ, ఎస్సీ వర్గాల్లో ఒకరికి అవకాశం దక్కొచ్చని భావిస్తున్నారు. టీడీపీ నుంచి రాజ్యసభ స్థానం ఆశిస్తున్న వారిలో భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ.. ఎస్సీ వర్గం నుంచి అవకాశం కల్పిస్తే వర్ల రామయ్య పేరు పరిశీలించవచ్చు. ఈ సారి అనూహ్యంగా ముస్లి మైనార్టీ వర్గం కు ఇచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. ఈ కోటాలో ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారుగా ఉన్న ఎం.ఎ. షరీఫ్ కు దక్కే అవకాశం ఉంది. బీసీ వర్గానికి ఇవ్వాలని డిసైడ్ అయితే సీనియర్ నేత యనమల రామకృష్ణుడు కు ఖాయం అవుతుందని చెబుతున్నారు.

**బీజేపీ నుండి అన్నామలై?**

జనసేన నుంచి ఇప్పటి వరకు లింగమేనని రమేశ్ పేరు వినిపించినా.. ఇప్పుడు అనూహ్యంగా పారిశ్రామిక వేత్త బండారు నరసింహరావు, టాలీవుడ్ లో వరసపెట్టి సినిమాలు చేస్తున్న ప్రముఖ నిర్మాత కూడా ఒకరు రేసులోకి వచ్చారు. ఇక.. బీజేపీ నుంచి తమిళనాడు బీజేపీ నేత అన్నామలై పేరు ఖరారైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే అన్నామలై విషయంలో కూటమి నేతలకు బీజేపీ నేతలు సమాచారం ఇచ్చినట్లు చెబుతున్నారు. చివరి నిమిషం లో అనూహ్య మార్పులు జరిగితే తప్ప ఈ పేర్లలోనే రాజ్యసభకు తుది ఎంపిక జరిగే అవకాశం ఉంది. కాగా, మూడు పార్టీల నేతలు నెలాఖరులో లేదా జూన్ మొదటివారంలో సమావేశం కానున్నారు. అధికారికంగా తమ అభ్యర్థులను డిక్లేర్ చేసే అవకాశం ఉంది.

# ఆకునూరి మురళి రిజైన్

**( మొదటి పేజీ తరువాయి )**

తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన ఆకునూరి మురళి రాజీనామా పత్రాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావుకు పంపించారు. ఈ సందర్భంగా విద్యా కమిషన్ ఛైర్మన్ పదవిని తనకు ఇచ్చిన తెలంగాణ ప్రభుత్వానికి ఆకునూరి మురళి ధన్యవాదాలు చెప్పారు. తనకు ఇచ్చిన పనిని పూర్తి చేశానని.. అందుకే తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆ రాజీనామా లేఖలో ఆకునూరి మురళి స్పష్టం చేశారు. తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మన్‌గా విద్యా శాఖలో చేపట్టాల్సిన మార్పులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేసినట్లు ఆకునూరి మురళి వెల్లడించారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంతోపాటు.. ఈ విద్యా రంగంలో తీసుకురాల్సిన సంస్కరణల కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసింది. దానికి ఆకునూరి మురళిని ఛైర్మన్‌గా నియమించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంపై నిరంతరం కీలక వ్యాఖ్యలు చేసే ఆకునూరి మురళి.. విద్యా రంగంలో కీలక మార్పుల కోసం పలు సిఫార్సులు చేశారు. ఈ క్రమంలోనే పదవీ కాలం పూర్తి కాకుండానే ఆయన పదవికి రాజీనామా చేయడం ఇప్పుడు ఎవరికీ అంతుచిక్కడం లేదు. ఆకునూరి మురళి సేవలను ఉపయోగించుకోవాలని రేవంత్ రెడ్డి సర్కార్ భావిస్తున్న వేళ.. ఆయన రాజీనామా చేయడం గమనార్హం.

# బెజవాడలో జీప్ వార్



**బెజవాడ, మహా** : వారిద్దరూ చిన్ననాటి నుంచి ప్రాణ స్నేహితులు. ఓ యువతి వ్యవహారంలో మనస్పర్థలు తలెత్తాయి. ఇది కాస్త ముదిరి నడిరోడ్డుపై వాహనాలతో ఢీకొట్టుకునే వరకు వెళ్లింది. అవి ధ్వంసమైనా పగ, కసి చల్లారక దిగి కలియబడ్డారు. ఈ ఘటన చూసి రోడ్డుపై వెళ్తున్న వారు భయంతో పరుగులు పెట్టారు. ఫ్యాక్షన్ సినిమాలోని పతాక సన్నివేశాలకు ఏమాత్రం తీసిపోని ఈ ఘటన విజయవాడలో హైటెన్షన్ రోడ్డులో గురువారం రాత్రి జరిగింది. తాడిగడపకు చెందిన లింగమనేని రోహిత్ ఇంజినీరింగ్ విద్యార్థి. విజయవాడలోని భారతీనగర్‌కు చెందిన బోల్లా ఓమ్ తన తండ్రితో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం చూసుకుంటున్నాడు. ఇతను వైకాపా నేత జోగి రమేష్‌కు బంధువుగా చెప్పుకొనేవాడు. జగన్ పుట్టిన రోజును కూడా తాడేపల్లిలో తాను చదివే ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఘనంగా చేశాడు. వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించాడు. ఓమ్, రోహిత్ ఇద్దరూ చిన్ననాటి నుంచి స్నేహితులు. ఓ యువతి వ్యవహారంలో ఇద్దరి మధ్య వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో రోహిత్‌కు ఓమ్ ఫోన్ చేశాడు. ఎక్కడ ఉన్నావని ప్రశ్నించాడు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. తాను పటమట ఆర్ఆర్ గార్డెన్‌లోని హైటెన్షన్ రోడ్డులో ఉన్నానని చెప్పాడు. ఇద్దరు ఒకరికొకరు సవాళ్లు విసురుకున్నారు.

**ఒకదానికొకటి ఢీకొట్టుకుంటూ..**

ఓమ్ తన థార్ జీప్‌పై రోహిత్ ఉన్న ప్రాంతానికి గురువారం రాత్రి వెళ్లాడు. రోహిత్ జీప్‌ను ఢీకొట్టాడు. ఆగ్రహంతో ఇద్దరూ పరస్పరం రోడ్డుపైనే పలుసార్లు ఒకరి వాహనాన్ని మరొకరు బలంగా ఢీకొట్టుకున్నారు. ఇలా ఢీకొట్టుకుంటూ సుమారు 100 మీటర్లు రోడ్డుపై ఈడ్చుకుంటూ హడావుడి చేశారు. యాక్షన్ సీన్లను తలపించేలా ఢీకొట్టుకున్నారు. ఆ సమయంలో రోడ్డుపై వాకింగ్ చేస్తున్న వారు, అటుగా వెళ్తున్న ప్రజలు.. భీతావహ దృశ్యాలను చూసి భయాందోళనలతో పరుగులు తీశారు. అప్పటికీ ఇద్దరూ వెనక్కి తగ్గలేదు. జీప్‌లు దిగి రాడ్లతో మళ్లీ కారు అద్దాలను పగలకొట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి సమీపంలోని పటమట పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు వచ్చే సరికి జీప్‌ను వదిలేసి రోహిత్ పరారయ్యాడు. ఓమ్‌ను స్టేషన్‌కు తీసుకువెళ్లి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పవన్‌కిషోర్ తెలిపారు. గొడవ జరిగినప్పుడు ఒకరి వాహనంలో ఓ యువతి, మరో వాహనంలో కొందరు యువకులు ఉన్నట్లు తెలిసింది. కాగా ఇరువురు యువకులను శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# అమెరికా ఇరాన్ శాంతి ఒప్పందం

**( మొదటి పేజీ తరువాయి )**

ప్రతిపాదిత ఒప్పందంలో భూ, సముద్ర, వాయు విభాగాల్లో బేషరతుగా తక్షణ, సమగ్ర కాల్పుల విరమణ నిబంధన ఉంటుంది. అమెరికా ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరే అవకాశం ఉందని సాక్షాత్తూ అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో వ్యాఖ్యానించారు. ఇరాన్‌తో ఒప్పందం దిశగా చర్చల్లో స్వల్ప పురోగతి సాధించామని ఆయన వెల్లడించారు. అమెరికా ఇరాన్ ఒప్పందం అమలును పర్యవేక్షించడానికి, ఇరుపక్షాల మధ్య వివాదాలను పరిష్కరించడానికి ఒక ఉమ్మడి యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని ముసాయిదా ఒప్పందంలో ప్రతిపాదించినట్లు తెలిసింది. ఈ ఒప్పందం అమల్లోకి వచ్చిన ఏడు రోజుల్లోగా అపరిష్కృత సమస్యలపై అమెరికా ఇరాన్ మధ్య చర్చలు ప్రారంభమవుతాయనే అంశాన్ని కూడా ముసాయిదాలో పొందుపరిచారు. ఒప్పందంలోని నిబంధనలకు ఇరాన్ కట్టుబడి ఉంటే, అందుకు ప్రతిగా ఇరాన్‌పై విధించిన ఆంక్షలను అమెరికా ఎత్తివేయనుందని సమాచారం. ఈక్రమంలో ఇరుదేశాలు అంతర్జాతీయ చట్టాలు, ఐక్యరాజ్యసమితి చార్టర్‌కు కట్టుబడి నడుచుకోవాలని ఈ ముసాయిదాలోని నిబంధనలు సూచిస్తున్నట్లు తెలిసింది. అమెరికా ఇరాన్ సంయుక్తంగా అధికారికంగా ప్రకటించిన వెంటనే ఈ ఒప్పందం అమల్లోకి వస్తుందని సౌదీ మీడియా పేర్కొంది.





# రూ. 60 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడిన రెవెన్యూ అధికారులు

**రాజేంద్రనగర్ , మహా ;** శంషాబాద్ రెవెన్యూ పరిధిలోని ఎయిర్‌పోర్ట్ కాలనీ సర్వే నెంబర్ 626/1లో రూ.60 కోట్లు విలువ చేసే సుమారు 5 ఎకరాల పైచిలుకు ప్రభుత్వ భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి అందులో తాత్కాలిక అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఔటర్ రింగ్ రోడ్ పక్కన సుమారు ఐదు ఎకరాల పైచిలుకు ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఎమ్మార్వో అమరలింగం గౌడ్ ఆదేశాలతో రెవెన్యూ అధికారి కృష్ణ తన సిబ్బందితో కలిసి భారీ పోలీసుల బంధవస్తు మధ్య జెసిబి సహాయంతో అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు. ప్రభుత్వ భూములలో అక్రమ నిర్మాణాలు చేపడితే నిర్ధాక్షణంగా కూల్చివేస్తాము, ల్యాండ్ గ్రాబింగ్ కేసులు నమోదు చేస్తామని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు.

# బీఆర్ఎస్ నే ప్రజలు రద్దుచేస్తారు

- **హరీష్ రావుపై ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఫైర్**
- **ఫ్యూచర్ సిటీతో భవిష్యత్ కు బంగారు బాట**

**ఇబ్రహీంపట్నం, మహా :** ఫార్మా సిటీ ఏర్పాటుతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడబోయిన బిఆర్ఎస్‌ను ప్రజలు సమాధి చేసినా కూడా ఆ పార్టీ నేతలకు బుద్ధి రాలేదని... మళ్ళీ ఫార్మా తెస్తామంటూ హరీష్ రావు సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా పర్యటనలో మాజీ మంత్రి హరీష్‌రావు ఫ్యూచర్ సిటీ రద్దు చేసి, ఫార్మా సిటీ మళ్ళీ తెస్తామని మాట్లాడటం పట్ల ఆయన తీవ్రంగా స్పందించారు. ఫార్మా అంటేనే గత ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం ప్రజలు వారిని తరిమికొట్టి తనను 40వేల ఓట్ల మెజార్టీతో గెలిపించారని గుర్తు చేశారు. మళ్ళీ ఇప్పుడు ఫ్యూచర్ సిటీ రద్దు చేసి, ఫార్మా సిటీ తెస్తామని అమెరికాలో తిరుగుతూ మాట్లాడుతున్న హరీష్ రావును, ఆయన పార్టీని తెలంగాణలో ఇక ప్రజలే రద్దు చేస్తారని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎక్కడ చేస్తుందో అమెరికాలో ఉండి కాదు ఇక్కడికి వచ్చి చూపించాలని సూచించారు. బిఆర్ఎస్ వచ్చేది లేదు... ప్రాణాలు తీసే ఫార్మా భయం అసలే లేదని, ప్రజలకు దీనిపై ఆందోళన అవసరం లేదన్నారు. హైదరాబాద్ నగరాన్ని విశ్వస్థాయిలో నిలబెట్టేలా తమ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంటే విదేశాల్లో తెలంగాణకు పెట్టుబడులు రాకుండా బిఆర్ఎస్ నేతలు అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి గులాబీ నేతల కళ్ళు మండుతున్నాయన్నారు. రంగారెడ్డి జిల్లాను అన్ని రకాలుగా దోపిడి చేసిన బిఆర్ఎస్ నేతలు... ఇప్పుడు ప్రగతి నిరోధకులుగా మారారని ఆరోపించారు. విషప్రచారం చేస్తే ఈ సారి డిపాజిట్లు కూడా దక్కవని హెచ్చరించారు. అధికారంలో ఉన్నప్పుడు భూసేకరణకు ముందు వేల ఉద్యోగాలని మోసం చేయటమేగాక, ఇప్పుడు అధికారం పోయాక ఫార్మాతో లక్షల ఉద్యోగాలు అంటున్నారన్న మల్ రెడ్డి... బిఆర్ఎస్ ఏర్పాటే అబద్ధాల పునాదులపై ఉందని ఆరోపించారు. బిఆర్ఎస్ నేతల తీరు మారకుంటే గ్రామాల్లో తిరిగే పరిస్థితి ఉండదని హెచ్చరించారు.



# కిషన్ రెడ్డి దావత్ ఆసక్తికర చర్చ

**హైదరాబాద్, మహా :**

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి శుక్రవారం జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి గుడి వద్ద ఇచ్చిన దావత్ పై పార్టీవర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఈ దావత్ కు పదివేల మందికి పైగా రావడడం, పార్టీలోని అన్ని వర్గాలకు చెందిన ముఖ్యులతో పాటు తనకు మద్దతుగా నిలుస్తున్న వివిధ వర్గాల వారిని ఆహ్వానించడం ఆసక్తికరంగా మారింది. కిషన్ రెడ్డిలో ఇటీవల కాలంలో మంచి మార్పును చూస్తున్నామని, ఇప్పటికిపుడు ఈ దావత్ వినడం వెనుక ఏదైనా శుభవార్త విన్నారా.. లేక త్వరలో ఏమైనా మార్పులు జరగబోతున్నాయా అన్న చర్చ పార్టీవర్గాలు పెట్టాయి. అయితే ప్రత్యేక కారణం లేదని, రెండుమూడు మాసాలుగా అనుకుంటుంటే ఇపుడు సమయం చిక్కిందని దగ్గరివారు చెప్పారు. కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రెండేళ్ళ తర్వాత



ఇపుడు దావత్ ఏంటి? ఏదో జరగబోతోంది? అని బీజేపీ నేతలు చర్చించుకుంటున్నారు.

# ప్రభుత్వ భూములకు డిప్యూటీ కలెక్టర్ ఎసరు

( మొదటి పేజీ తరువాయి )

వచ్చాయి. ఈ భూములను తన మామ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించి ఆ తర్వాత రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ధారాదత్తం చేసినట్లు ఏసీబీ అధికారుల విచారణలో వెల్లడైంది. గురువారం తెల్లవారుజాము నుంచే డిప్యూటీ కలెక్టర్ వంశీ మోహన్ ఇళ్లలో ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. వంశీమోహన్ ఇళ్లతో పాటు ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితుల ఇళ్లు సహా మొత్తం 8 ప్రాంతాల్లో ఏకకాలంలో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఇక ప్రభుత్వ భూమిని రియల్టర్‌కు ధారాదత్తం చేయడంతో.. అందుకు బదులుగా వంశీ మోహన్ కుటుంబ సభ్యుల పేరు మీద ఆ రియల్టర్ 10 ప్లాట్లను గిఫ్ట్ డీడ్ రూపంలో తిరిగి పొందినట్లు ఏసీబీ అధికారులు పక్కాగా ఆధారాలను సేకరించారు. ఆ ప్లాట్ల విలువ రూ.కోట్లల్లో ఉంటుందని గుర్తించారు.

హైదరాబాద్ సహా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వంశీమోహన్‌కు రూ.వందల కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నాయని ఏసీబీ అధికారుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ ఏసీబీ సోదాల్లో భారీగా ఆస్తి పత్రాలు, బ్యాంకు డిపాజిట్లు, బంగారం, డబ్బును ఏసీబీ అధికారులు సీజ్ చేశారు. ప్రభుత్వ భూములను.. అక్రమ



రిజిస్ట్రేషన్లతో ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతూ.. రూ. కోట్ల డబ్బును లంచాల రూపంలో.. ప్లాట్లను తన కుటుంబ సభ్యుల పేరు మీదికి తెచ్చుకున్నారని ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలోనే వంశీమోహన్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసును నమోదు చేసిన ఏసీబీ అధికారులు దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

# దమ్ముంటే అసెంబ్లీ రద్దు చేసి ఎన్నికలకు రా.

**హైదరాబాద్, మహా :** రేవంత్ రెడ్డికి ఏమాత్రం దమ్ము, ధైర్యం ఉన్నా తక్షణమే అసెంబ్లీని రద్దు చేసి ఎన్నికల బరిలో తేల్చుకోవాలని టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ సవాల్ విసిరారు. బండి సంజయ్ కుమారుడి పోక్సో కేసు వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వ రక్షణను, ధాన్యం కొనుగోళ్లలో సర్కార్ ఘోర వైఫల్యాన్ని, కాంగ్రెస్ నేతల భూకబ్జాలను ఎండగడుతూ ,గన్నీ బ్యాగులు దొరకడం లేదు కానీ, రాష్ట్రంలో గన్నులు మాత్రం విచ్చలవిడిగా దొరుకుతున్నాయి అంటూ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ప్రభుత్వ వైఫల్యాలపై శుక్రవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిర్వహించిన మీడియా సమావేశం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర సంచలనం రేపింది. అధికార కాంగ్రెస్, కేంద్రంలోని బీజేపీ పార్టీల తీరుపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, రైతాంగం ఎదుర్కొంటున్న సంక్షోభం, శాంతిభద్రతల వైఫల్యం, అలాగే బండి సంజయ్ కుమారుడి పోక్సో కేసు వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరించిన వైఖరిని కేటీఆర్ ఎండగట్టారు. ఇదే సమయంలో, గల్ఫ్ దేశాలలో ఉపాధి కోసం వెళ్లిన తెలంగాణ బిడ్డల ఓటు హక్కును కాపాడేందుకు బీఆర్ఎస్ పార్టీ తరఫున 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' కార్యక్రమం ద్వారా ప్రత్యేక కార్యాచరణ చేపడతామని ఆయన స్పష్టం చేశారు.

**కాంగ్రెస్, బీజేపీల చీకటి ఒప్పందం**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీజేపీ నేతలు కుమ్మక్కయ్యారని కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఒక మైనర్ బాలికకు అన్యాయం జరిగితే, న్యాయం చేయాల్సిన ప్రభుత్వం నిందితుడిని తొమ్మిది రోజుల పాటు కాపాడిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండదండలతోనే నిందితుడిని సీఎం బంధువులకు చెందిన మెడికవర్ ఆసుపత్రిలోని 28వ అంతస్తులో అత్యంత రహస్యంగా దాచారని ఆరోపించారు. హైకోర్టు



ముందస్తు బెయిల్ నిరాకరించడంతోనే రేవంత్ రెడ్డి అరెస్ట్ డ్రామాలు, బండి సంజయ్ లొంగుబాటు నాటకాలు ఆడించారని విమర్శించారు. బాధితురాలి వివరాలను సోషల్ మీడియాలో బయటపెట్టిన బీజేపీ నేతలపై చర్యలు తీసుకోవాలని, అలాగే ఈ దారుణాన్ని 'హనీ ట్రాప్' అంటూ అడ్డగోలు కథనాలు రాసిన మీడియా సంస్థలపైనా విచారణ జరగాలని డిమాండ్ చేశారు. నిందితుడిని దాచిపెట్టిన బండి సంజయ్ తక్షణమే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని కేటీఆర్ పట్టుబట్టారు. ఈ సున్నితమైన కేసులో మైనర్ బాలికకు న్యాయం జరిగేలా పోరాడిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

**శ్వేతపత్రం విడుదల చేయాలి**

రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని కేటీఆర్ ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా కనీసం 30 నుంచి 35 శాతం ధాన్యం కూడా కొనుగోలు చేయలేదని, కానీ ముఖ్యమంత్రి 80 శాతం, మంత్రులు 50 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయంటూ పచ్చి అబద్ధాలు ఆడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏ ఊరికైనా వెళ్దామని, 80 శాతం పంట కొనుగోళ్లు జరిగాయని నిరూపిస్తే తాను ఏ శిక్షకైనా సిద్ధమని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు. రాష్ట్రంలో రైతులకు కావాల్సిన గన్నీ బ్యాగులు దొరకడం లేదని, కానీ నేరగాళ్లకు కావాల్సిన గన్నులు మాత్రం విచ్చలవిడిగా దొరుకుతున్నాయని శాంతిభద్రతల క్షీణతను ఎద్దేవా చేశారు. తక్షణమే కేబినెట్ సమావేశం నిర్వహించి, పంట కొనుగోళ్లపై పంటల వారీగా లెక్కలతో కూడిన శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇదే క్రమంలో ప్రధాని మోదీ పర్యటనను ప్రస్తావిస్తూ, రైతులు యూరియా వాడకం తగ్గించాలని, ప్రజలు బంగారం కొనడం తగ్గించాలని ఉచిత సలహాలు ఇచ్చి, రాష్ట్ర ప్రజలకు ప్రధాని 'చావు కబురు చల్లగా చెప్పారని' కేటీఆర్ విమర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి భూ దోపిడీ మీద ఉన్న శ్రద్ధ, భూమిని నమ్ముకున్న రైతుల మీద లేదని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నేతలు అడ్డగోలుగా భూములను ఆక్రమిస్తున్నారని, వేం నరేందర్ రెడ్డి 'భూ హారతి' పేరుతో కేసముద్రంలో అసైన్డ్ భూములను ఆక్రమించారని ఆరోపించారు. శంషాబాద్‌లో సీఎం అనుచరులు అధికారులపై ఒత్తిడి తెచ్చి ఏకంగా 90 ఎకరాల సీలింగ్ భూమిని కేటాయించుకుని వేల కోట్ల రూపాయల దందాకు తెరలేపారని ఆయన దుయ్యబట్టారు. తన బావమరిది ఫామ్‌హౌస్ పై డ్రగ్స్ దాడి జరిగిందంటూ సీఎం చేస్తున్న ఆరోపణలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. అక్కడ ఏమీ దొరకలేదని స్వయంగా ప్రభుత్వ అధికారులే తేల్చిచెప్పారని గుర్తు చేశారు. 2034 వరకు తానే సీఎంగా ఉంటానని గొప్పలు చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డికి నిజంగా అంత ధైర్యం, దమ్ము ఉంటే వెంటనే అసెంబ్లీని రద్దు చేసి ఎన్నికలకు వెళ్లాలని కేటీఆర్ సవాల్ విసిరారు. అది చేతకాకపోతే, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ప్రజాతీర్పు కోరాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టినా బీఆర్ఎస్ పార్టీ భయపడదని, ధైర్యంగా ప్రజాక్షేత్రంలోనే ఎదుర్కొంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# వరంగల్ కమిషనర్ లో భారీగా పోలీస్ సిబ్బంది బదిలీలు

**మహా వరంగల్ బ్యూరో :** వరంగల్ పోలీస్ కమిషనర్ పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ కాలపరిమితిని పూర్తి చేసిన 15 మంది ఏఎస్ఐలు, 160 మంది హెడ్ కానిస్టేబుళ్ళు, 47 మంది కానిస్టేబుళ్లకు అధికారులు చేపట్టిన కౌన్సిలింగ్ ద్వారా సిబ్బంది ఎంపిక చేసిన వివిధ పోలీస్ స్టేషన్లకు బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీతిసింగ్ ఉత్తర్వులు జారీ చేశారు.

# పుస్తెలతాడు అపహరణ

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా (యాచారం) : గుర్తు తెలియని దుండగుడు పథకం ప్రకారం ఓ వృద్ధ మహిళను మాయమాటలతో బురిడీ కొట్టించి ఆమె మెడలో నుంచి బంగారం అపహరించాడు. యాచారం ఠాణా పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. సిఐ నందీశ్వర్ రెడ్డి వివరాల మేరకు యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గాండ్లగూడలో దేవర కొండ పోచమ్మ (70) అనే వృద్ధ మహిళ రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం 8:30 కు తన ఇంటి ముంగిట్లో కూర్చుంది. ఇదే అదునుగా భావించి గుర్తు తెలియని ఓ వ్యక్తి బైక్ పై వృద్ధురాలి వద్దకు వచ్చి జనాభా లెక్కల కోసం వచ్చానని ఇంట్లో ఎవరూ లేరా అని అడుగుతూనే మాయ మాటలతో మభ్యపెట్టి వృద్ధురాలు మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడుతో పాటు బంగారు గుండ్లను బలవంతంగా లాక్కొని అక్కడి నుంచి బైక్ పై పరారీ అయ్యాడు. బంగారం అపహరణతో గాయమైన పోచమ్మను ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. బాధిత వృద్ధురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు



# ఫ్యూచర్ సిటీ'ని రద్దు చేస్తాం

**మాజీ మంత్రి హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు.**

**హైదరాబాద్, మహా :** రేవంత్ సర్కార్ ప్రతిపాదించిన ఫ్యూచర్ సిటీని తాము మళ్లీ అధికారంలోకి రాగానే పూర్తిగా రద్దు చేస్తామని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంచలన ప్రకటన చేశారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ఆయన, గత బీఆర్ఎస్ ప్రభుత్వం సంకల్పించిన 'ఫార్మా సిటీ'ని యథాతథంగా పునరుద్ధరిస్తామని అన్నారు. కేంద్ర పర్యావరణ శాఖ అన్ని రకాల క్లియరెన్సులు, అనుమతులు కేవలం 'ఫార్మా సిటీ' ఏర్పాటుకు మాత్రమే ఇచ్చిందని గుర్తుచేశారు. అనుమతి పొందిన ప్రాజెక్టును కాదని, అక్కడ విరుద్ధంగా వేరే ప్రాజెక్టు చేపడితే చట్ట ప్రకారం తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. భూసేకరణ చట్టం ప్రకారం ఏ ప్రయోజనం కోసం అయితే రైతుల నుంచి భూములు సేకరించారో, దానికి భిన్నంగా (డీవియేషన్) వేరే వ్యాపారాలు చేస్తే సదరు భూములను తిరిగి రైతులకు అప్పగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందని పార్లమెంట్ చట్టాన్ని ఉటంకిస్తూ ఆయన వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు వెనుక పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ ప్రయోజనాలు దాగున్నాయని హరీశ్‌రావు ఆరోపించారు. ఫ్యూచర్ సిటీ పేరుతో భూములు పంచిపెట్టి, బ్యాక్ ఎండ్‌లో లబ్ధి పొందాలని పాలకులు ప్లాన్ చేశారని ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఫార్మా సిటీ పూర్తయితే తమకు ఎక్కడ మంచి పేరు వస్తుందోననే ఈర్ష్యతోనే రేవంత్ రెడ్డి ఈ విధమైన మార్పులకు శ్రీకారం చుట్టారని విమర్శించారు. ఏదేమైనా అక్కడ ఉన్నది ఉన్నట్టుగా ఫార్మా సిటీనే వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# వైద్య రంగంలో తమిళనాడు సర్కార్ సంచలనం

- ఒకేసారి 8 వేల కొత్త ప్రైవేట్ ఆస్పత్రులకు గ్రీన్ సిగ్నల్!
- ఆన్‌లైన్‌లో సమాచారం అప్‌లోడ్ చేస్తే చాలు.
- వెంటనే తాత్కాలిక ధృవపత్రాల జారీ.
- క్షేత్రస్థాయిలో పూర్తి తనిఖీల తర్వాతే శాశ్వత గుర్తింపు.
- ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యమన్న ఆరోగ్యశాఖ.

**చెన్నై, మహా.:** ప్రజారోగ్య పరిరక్షణ, వైద్య సేవలను మరింత వేగవంతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించిన తమిళనాడు ప్రభుత్వం మరో చారిత్రాత్మక నిర్ణయంతో ముందడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా ఏర్పాటు చేయ తలపెట్టిన సుమారు 8 వేల ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లకు తాత్కాలిక అనుమతులు మంజూరు చేస్తూ స్టాలిన్ సర్కార్ సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆన్‌లైన్ వేదికగా అవసరమైన పత్రాలు, సమాచారాన్ని అప్‌లోడ్ చేసిన వెంటనే ఎలాంటి జాప్యం లేకుండా తాత్కాలిక ధృవపత్రాలు (ప్రొవిజనల్ సర్టిఫికేట్స్) జారీ చేయనున్నట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖ అధికారికంగా ప్రకటించింది. వైద్య రంగంలో ఇన్‌స్పెక్టర్ రాజ్‌కు చరమగీతం పాడుతూ, పారదర్శకతను పెంచేందుకు ఈ విప్లవాత్మక విధానాన్ని తీసుకొచ్చినట్లు వెల్లడించింది. గతంలో కొత్త ఆసుపత్రుల స్థాపనకు లేదా క్లినిక్‌ల ఏర్పాటుకు అనుమతులు సాధించాలంటే నెలల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఈ సుదీర్ఘ ప్రక్రియకు స్వస్తి పలుకుతూ ఆరోగ్యశాఖ సరికొత్త సరళీకృత విధానాన్ని అమల్లోకి తెచ్చింది. నూతన నిబంధనల ప్రకారం.. వైద్య సంస్థల నిర్వాహకులు ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లో లాగిన్ అయి, తమ మౌలిక వసతులు, వైద్యుల వివరాలు, కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు వంటి అవసరమైన సమాచారాన్ని సమర్పించాల్సి ఉంటుంది. అలా అప్‌లోడ్ చేసిన తక్షణమే వ్యవస్థ స్వయంచాలకంగా (ఆటోమేటెడ్‌గా) తాత్కాలిక అనుమతి పత్రాన్ని జారీ చేస్తుంది. దీని ద్వారా నిర్వాహకులు వెంటనే తమ వైద్య సేవలను ప్రారంభించుకునే వీలుంటుంది.అయితే, ఈ తాత్కాలిక అనుమతులు పొందిన ఆసుపత్రులపై ప్రభుత్వం నిరంతర నిఘా ఉంచనుంది. తాత్కాలిక ధృవపత్రాలు పొందిన నిర్దిష్ట గడువు లోపు ఆరోగ్యశాఖకు చెందిన ఉన్నతాధికారుల బృందం సదరు ఆసుపత్రులను క్షేత్రస్థాయిలో స్వయంగా సందర్శిస్తుంది. అక్కడ మౌలిక సదుపాయాలు, నిబంధనల అమలు, రోగులకు అందుతున్న సేవల నాణ్యతను క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. ఈ తనిఖీల్లో అన్ని నిబంధనలు సక్రమంగా ఉన్నాయని నిర్ధారణ అయిన తర్వాతే సదరు యాజమాన్యాలకు పూర్తిస్థాయి శాశ్వత ధృవపత్రాలను జారీ చేయనున్నారు. ఒకవేళ ఆన్‌లైన్‌లో తప్పుడు సమాచారం ఇచ్చినట్లు తేలితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై రాష్ట్ర వైద్య వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఏకకాలంలో 8 వేల కొత్త వైద్య కేంద్రాలు అందుబాటులోకి రావడం వల్ల ప్రజలకు తక్కువ సమయంలో, అత్యంత చేరువలో వైద్య సేవలు అందుతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడేందుకు, వైద్య రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ నూతన విధానం దేశానికే దిక్సూచిగా మారుతుందని తమిళనాడు ఆరోగ్యశాఖ ధీమా వ్యక్తం చేసింది.

# బెంగాల్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మెరుపు దాడులు

- వాంటెడ్ క్రిమినల్ 'సోనా పప్పు' దందాపై ఈడీ ఉక్కుపాదం.
- కోల్‌కతా రాయ్ స్ట్రీట్‌లోని వ్యాపారవేత్త ఇల్లు, హోటల్‌లో ముమ్మర సోదాలు.
- పాత నోట్ల మార్పిడి, హవాలా లింకులపై ఆరా.
- మాజీ డిప్యూటీ కమిషనర్ శంతన్ సిన్హా నివాసంలోనూ తనిఖీలు.
- ఏకకాలంలో పలుచోట్ల రికార్డుల పరిశీలనతో వణికిపోతున్న అక్రమార్కులు.

**కోల్‌కతా,మహా** పశ్చిమ బెంగాల్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు మరోసారి ఉక్కుపాదం మోపారు. రాష్ట్రవ్యాప్తంగా గురువారం తెల్లవారుజాము నుంచే ఏకకాలంలో అనేక చోట్ల ఈడీ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న వాంటెడ్ క్రిమినల్ 'సోనా పప్పు' అక్రమ దందా, హవాలా నెట్‌వర్క్‌ను ఛేదించడమే లక్ష్యంగా ఈ సోదాలు కొనసాగుతున్నాయి. కోల్‌కతా సహా పరిసర ప్రాంతాల్లోని పలు కీలక స్థావరాలపై కేంద్ర బలగాల భారీ భద్రత నడుమ అధికారులు విరుచుకుపడటంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.ఈ దాడుల్లో భాగంగా కోల్‌కతాలోని ప్రముఖ వ్యాపార ప్రాంతమైన రాయ్ స్ట్రీట్‌పై ఈడీ ప్రత్యేకంగా దృష్టిసారించింది. అక్కడ నివసిస్తున్న ఒక ప్రముఖ వ్యాపారవేత్త నివాసంతో పాటు, ఆయనకు చెందిన లగ్జరీ హోటల్‌లో అధికారులు అంగుళం అంగుళం గాలిస్తున్నారు. సోనా పప్పుతో సదరు వ్యాపారవేత్తకు ఉన్న ఆర్థిక లావాదేవీలు, బినామీ పెట్టుబడులకు సంబంధించిన కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. గత కొంతకాలంగా సాగుతున్న ఈ అక్రమ సామ్రాజ్యానికి ఈ హోటల్ వేదికగా మారిందన్న పక్కా నిఘా వర్గాల సమాచారంతోనే ఈ వ్యూహాత్మక దాడులు జరిగినట్లు తెలుస్తోంది.

మరోవైపు, ఈ వ్యవహారంలో ఉన్నతాధికారుల హస్తంపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో.. మాజీ డిప్యూటీ కమిషనర్ శంతన్ సిన్హా నివాసంలోనూ ఈడీ అధికారులు తనిఖీలు చేపట్టడం రాష్ట్రంలో కలకలం రేపుతోంది. ఆయన పదవిలో ఉన్న సమయంలో సోనా పప్పు అక్రమ దందాలకు పరోక్షంగా సహకరించారనే అనుమానాలతో పాటు, పెద్ద ఎత్తున చేతులు మారిన నల్లధనంపై అధికారులు ఆరా తీస్తున్నారు. శంతన్ సిన్హా నివాసంలోని డిజిటల్ డివైజ్‌లు, ల్యాప్‌టాప్‌లు, బ్యాంక్ లాకర్ల వివరాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.సోనా పప్పు ఆర్థిక వనరులను పూర్తిగా దెబ్బతీయడమే ధ్యేయంగా సాగుతున్న ఈ దాడులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటివరకు జరిపిన సోదాల్లో భారీ ఎత్తున నగదు, విదేశీ కరెన్సీతో పాటు కీలకమైన ఆస్తుల పత్రాలు లభ్యమైనట్లు ఈడీ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ దాడుల అనంతరం మరికొందరు ప్రముఖులకు ఈడీ నోటీసులు ఇచ్చే అవకాశం ఉందని, ఈ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్న ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని దర్యాప్తు సంస్థ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి

# హీరా గ్రూప్ అధినేత్రి నౌహీరా షేక్ అరెస్ట్

- * గుర్గావ్‌లో అదుపులోకి తీసుకున్న ఈడీ.
- * నేడు హైదరాబాద్‌కు తరలింపు.
- *సుప్రీంకోర్టు ఆదేశాల ఉల్లంఘన.
- * నకిలీ ఆధార్ కార్డుతో తలదాచుకున్న వైనం.
- * సాంకేతిక ఆధారాలతో గుట్టురట్టు చేసిన అధికారులు.
- * ఐఏఎస్ అధికారి అమోయ్ కుమార్‌కు మళ్లీ ఈడీ సమన్లు.
- * భూదాన్ భూముల వ్యవహారంలో ఈ నెల 25న విచారణకు హాజరుకావాలని ఆదేశం.

**హైదరాబాద్, మహా :** బహుళ ప్రాచుర్యం పొందిన హీరా గ్రూప్ ఇన్వెస్ట్‌మెంట్ కుంభకోణం కేసులో ఆ సంస్థ అధినేత్రి నౌహీరా షేక్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. గత కొంతకాలంగా అధికారుల కళ్ళు గప్పి తిరుగుతున్న ఆమెను హర్యానాలోని గుర్గావ్‌లో ఈడీ బృందం అత్యంత చాకచక్యంగా అదుపులోకి తీసుకుంది. గతంలోనే ఆమె కోర్టుకు సరెండర్ కావాలని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, ఆమె వాటిని బేఖాతరు చేస్తూ పరారీలో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఆమెకు మంజూరైన బెయిల్‌ను రద్దు చేయాలని ఈడీ న్యాయస్థానాన్ని కోరిన విషయం విదితమే.

నౌహీరా షేక్‌పై కొద్ది రోజుల క్రితమే కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఆ సమయం నుంచే ఆమె పూర్తిగా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఈ క్రమంలో తనపై ఉన్న నాన్‌బెయిలబుల్ వారెంట్‌పై స్టే ఇవ్వాలని కోరుతూ ఆమె హైకోర్టును ఆశ్రయించినప్పటికీ, న్యాయస్థానం స్టే ఇచ్చేందుకు సరుకున నిరాకరించింది. అప్పటి నుంచి పక్కా వ్యూహంతో రంగంలోకి దిగిన ఈడీ అధికారులు నిందితురాలి కదలికలపై నిఘా పెట్టారు. అత్యాధునిక సాంకేతిక ఆధారాల (టెక్నికల్ ఎవిడెన్స్) సహాయంతో ఆమె గుర్గావ్‌లో తలదాచుకున్నట్లు పక్కాగా గుర్తించారు. అక్కడ తప్పుడు వివరాలతో కూడిన ఫేక్ ఆధార్ కార్డును సృష్టించి, ఒక ఇంట్లో రహస్యంగా నివసిస్తున్న నౌహీరా షేక్‌ను అధికారులు గురువారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. ట్రాన్సిట్ వారెంట్‌పై ఆమెను ఈరోజు హైదరాబాద్‌కు తరలిస్తున్నారు.

****భూదాన్ ఉచ్చులో ఐఏఎస్.. అమోయ్ కుమార్‌కు మళ్లీ ఈడీ నోటీసులు!****

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన భూదాన్ భూముల కేటాయింపుల వ్యవహారంలో ప్రముఖ ఐఏఎస్ అధికారి అమోయ్ కుమార్‌కు ఈడీ మరోసారి సమన్లు జారీ చేసింది. ఈ భూముల బదలాయింపులో పెద్ద ఎత్తున మనీ లాండరింగ్ (ఆర్థిక అక్రమాలు) జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించిన దర్యాప్తు సంస్థ, ఆ కోణంలో విచారణను మరింత తీవ్రతరం చేసింది. ఇందులో భాగంగానే ఈ నెల 25వ తేదీన హైదరాబాద్‌లోని ఈడీ ప్రాంతీయ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని ఆయనకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.గతంలో 2024 లోనే అమోయ్ కుమార్‌ను ఈడీ అధికారులు సుదీర్ఘంగా విచారించి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. అయితే, తాజాగా సాగిన దర్యాప్తులో కొన్ని కీలక ఆధారాలు లభించడంతో ఆయనకు మళ్లీ సమన్లు పంపారు. ఈసారి విచారణకు వచ్చేటప్పుడు సదరు భూములకు సంబంధించిన మూడు ముఖ్యమైన సేల్ డీడ్ (క్రయవిక్రయాల) పత్రాల సంపూర్ణ వివరాలతో హాజరుకావాలని ఈడీ నోటీసుల్లో పేర్కొంది. గతంలో రంగారెడ్డి జిల్లా మహేశ్వరం పోలీస్ స్టేషన్‌లో నమోదైన పలు క్రిమినల్ కేసుల ఆధారంగా ఈడీ ఈ మనీ లాండరింగ్ దర్యాప్తును చేపట్టింది.

ఆరోపణల ప్రకారం.. దాదాపు 42 ఎకరాల అత్యంత విలువైన భూదాన్ భూములను నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడంలో అమోయ్ కుమార్ కీలక పాత్ర పోషించారనే విమర్శలు ఉన్నాయి. ఈ భారీ భూకేటాయింపుల ప్రక్రియ ద్వారా ఆయన వ్యక్తిగతంగా పెద్ద ఎత్తున ఆర్థిక లబ్ధి పొందినట్లు బలమైన ఆరోపణలు వస్తున్నాయి. ఈ నెల 25న జరిగే విచారణలో ఈడీ అధికారులు ఆయనను మరిన్ని పక్కా ఆధారాలతో ప్రశ్నించే అవకాశం ఉండటంతో, బ్యూరోక్రసీ వర్గాల్లో ఈ ఉదంతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# శంషాబాద్‌లో భారీగా అంతర్జాతీయ డ్రగ్స్ కలకలం

**హైదరాబాద్, మహా :** భాగ్యనగర ముఖద్వారమైన శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వేదికగా సాగుతున్న అంతర్జాతీయ డ్రగ్స్ స్మగ్లింగ్ ముఠా గుట్టును కస్టమ్స్ అధికారులు రట్టు చేశారు. విమానాశ్రయంలో శుక్రవారం నిర్వహించిన ముమ్మర తనిఖీల్లో భారీగా తరలిస్తున్న డ్రగ్స్ పట్టుబడటం తీవ్ర కలకలం రేపింది. అంతర్జాతీయ మార్కెట్లో సుమారు రూ.10 కోట్ల విలువైన 10 కేజీల అత్యంత ఖరీదైన గంజాయిని (హైడ్రోపోనిక్ వీడ్) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విదేశాల నుంచి అక్రమంగా ఈ వ్యసన పదార్థాన్ని నగరంలోకి ప్రవేశపెట్టేందుకు జరిగిన పెద్ద వ్యూహాన్ని అధికారులు చాకచక్యంగా తిప్పికొట్టారు.

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ నుంచి వచ్చిన ఒక విమాన ప్రయాణికుడి కదలికలపై కస్టమ్స్ ఎయిర్ ఇంటెలిజెన్స్ విభాగం అధికారులకు తీవ్ర అనుమానం వచ్చింది. సదరు ప్యాసింజర్ గ్రీన్ ఛానల్ దాటేందుకు ప్రయత్నిస్తుండగా అధికారులు అడ్డుకుని ఆధీనంలోకి తీసుకున్నారు. అనంతరం అతడి లగేజీ బ్యాగులను ఎక్స్‌రే మిషన్ల ద్వారా క్షుణ్ణంగా స్క్రీనింగ్ చేయగా, లోపల అనుమానాస్పద ప్యాకెట్లు దర్శనమిచ్చాయి. బ్యాగులను తెరిచి చూడగా, కస్టమ్స్ అధికారుల కళ్లు బైర్లు కమ్మేలా వ్యాక్యూమ్ ప్యాక్ చేసిన కవర్లలో దాచిన 10 కేజీల మేలిరకం గంజాయి లభ్యమైంది. దీంతో అధికారులు ఆ డ్రగ్స్‌ను సీజ్ చేసి, సదరు నిందితుడిని అక్కడికక్కడే అరెస్ట్ చేశారు.

ఈ భారీ స్మగ్లింగ్ ఉదంతం వెనుక అంతర్జాతీయ డ్రగ్స్ మాఫియా నెట్‌వర్క్ హస్తం ఉందనే కోణంలో ఎయిర్‌పోర్ట్ పోలీసులు, కస్టమ్స్ అధికారులు సంయుక్తంగా లోతైన విచారణ ప్రారంభించారు. బ్యాంకాక్ నుంచి హైదరాబాద్‌కు ఈ డ్రగ్స్ ఎవరు పంపించారు? నగరంలో ఎవరికి సరఫరా చేయాల్సి ఉంది? అనే అంశాలపై నిందితుడిని నిఘా వర్గాలు సుదీర్ఘంగా ప్రశ్నిస్తున్నాయి. నిందితుడి మొబైల్ ఫోన్ డేటా, కాల్ హిస్టరీ, విదేశీ ప్రయాణాల రికార్డులను సైబర్ క్రైమ్ విభాగం సాయంతో విశ్లేషిస్తున్నారు.

ఇటీవలి కాలంలో విదేశాల నుంచి విమానాల ద్వారా హైదరాబాద్‌కు డ్రగ్స్ రవాణా అవుతున్న ఘటనలు పెరగడంతో ఎయిర్‌పోర్ట్‌లో భద్రతను, నిఘాను మరింత కఠినతరం చేశారు. ముఖ్యంగా బ్యాంకాక్, కౌలాలంపూర్ వంటి నగరాల నుంచి వచ్చే విమానాల ప్రయాణికులపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి మరికొన్ని గంటల్లో మరిన్ని కీలక అరెస్టులు జరిగే అవకాశం ఉందని పోలీసు వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

# ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోవద్దు: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

డంపింగ్ యార్డుకు భూమి కేటాయిస్తే రాజీనామాలకు సిద్ధం:ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ కలెక్టర్‌కు వినతిపత్రం

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:కొంగరకలాన్‌లో జరిగిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' రంగారెడ్డి జిల్లా స్థాయి సమావేశం వేదికగా సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ వివాదం చర్చనీయాంశమైంది. కొత్తూరు మండలంలో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్ కోసం ఎట్టి పరిస్థితుల్లోనూ భూమి కేటాయించొద్దు అని డిమాండ్ చేస్తూ కొత్తూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎల్లారం శేఖర్ రెడ్డి, సీనియర్ నేత, మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల సర్పంచులు 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' రంగారెడ్డి జిల్లా స్థాయి సమావేశంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి గారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమక్షంలో స్థానిక ప్రజాప్రతినిధులు తమ నిరసనను గట్టిగా వినిపించారు. అధికారులు ప్రజాభిప్రాయానికి వ్యతిరే



కంగా నిర్ణయాలు తీసుకోకూడదని, ప్రజల అభీష్టమే పరమావధిగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. దీనికి మద్దతుగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కలెక్టర్‌తో మాట్లాడుతూ... ప్రజల ప్రయోజనాలను పణంగా పెట్టి డంపింగ్ యార్డ్ కోసం భూమి కేటాయిస్తే తామంతా రాజీనామాలకు కూడా సిద్ధపడతామని హెచ్చరించారు. సిద్ధాపూర్ పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్య రక్షణ దృష్ట్యా ఈ ప్రతిపాదనను తక్షణమే వెనక్కి తీసుకోవాలని ప్రజాప్రతినిధులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.

# విషపూరిత ఫార్మాసిటీకి స్వస్థీ చెప్పాం...

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రంగారెడ్డి జిల్లా మనుగడను దెబ్బతీసేలా గత బిఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన విషపూరిత ఫార్మాసిటీని రద్దు చేసి, ప్రపంచస్థాయిలో ఈ ప్రాంతాన్ని నిలబెట్టేలా ఫ్యూచర్ సిటీకి నాందీ పలికామని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి సమావేశం శుక్రవారం కొంగరకలాన్ లోని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో జరిగింది. ఈ సమావేశానికి శాసనమండలిలో చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల, షాద్ నగర్, కల్వకుర్తి ఎమ్మెల్యేలు ప్రకాశ్ గౌడ్, అరికెపూడి గాంధీ, యాదయ్య, ఈర్లపల్లి శంకర్, కసిరెడ్డి నారాయణరెడ్డి, కార్పొరేషన్ల చైర్మన్లు మల్ రెడ్డి రాంరెడ్డి, చల్లా నరసింహారెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. 99రోజుల ప్రణాళికలో భాగంగా చేపట్టిన కార్యక్రమాల గురించి ఈ సందర్భంగా చర్చించారు. రైతు భరోసా, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి, గృహజ్యోతి, పెన్షన్లు తదితర పథకాల అమలు తీరును సమీక్షించారు. వరి పంటకి కల్పిస్తున్న బోనస్ తో 1, 464మంది రైతులకు ప్రయోజనం చేకూరినట్లు అధికారులు వివరించారు.లక్షా 5వేల 978 కొత్త రేషన్ కార్డులు అందించినట్లు తెలిపారు. రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల పాలు చేసి తమ చేతికి ఇచ్చినా దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమ పథకాలను రేవంత్ రెడ్డి సర్కార్ అమలు చేస్తోందని మల్ రెడ్డి రంగారెడ్డి చెప్పారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పూర్తి స్థాయిలో ప్రజలకు అందేలా అధికారులు కృషి చేయాలని ఆయన కోరారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు కలెక్టర్, ఎమ్మెల్యేలు చెక్కులు పంపిణీ

# మామిడి సిరుల భారతం

**ఉత్పత్తిలో రారాజు.. ఎగుమతుల్లో అగ్రగామి మామిడి ఉత్పత్తిలో మనదే ఆధిపత్యం.**



**మహా ప్రత్యేకం**

వేసవి తాపాన్ని సైతం మరిపించేలా చేసే అమృత ఫలం మామిడి. భారతీయ సంస్కృతిలో, వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలో ఫలాల రారాజుగా కీర్తించబడే ఈ మామిడికి ఉన్న ప్రాధాన్యం అనన్య సామాన్యం. కమ్మని రుచి, ఆకట్టుకునే రంగు, నోరూరించే సువాసనలతో.. దేశ నలుమూలలా మట్టి వాసనను పుణికిపుచ్చుకుని రాష్ట్రానికో రకం మామిడి పండుతోంది. సామాన్యుడి విస్తరాకు నుంచి విదేశీయుల డైనింగ్ టేబుల్ వరకు భారతీయ మామిడి పండు పంచుతున్న రుచి అనిర్వచనీయం. కేవలం రుచిలోనే కాకుండా వాణిజ్యపరంగా, ఉత్పత్తి పరంగా మన దేశం ప్రపంచ పటంలో సగర్వంగా అగ్రస్థానంలో నిలబడటం వెనుక ఎంతో లోతైన వ్యవసాయ కృషి దాగి ఉంది.



### మామిడి సృష్టిస్తున్న ఆర్థిక ప్రభంజనం

భారతీయ మామిడి సృష్టిస్తున్న ఆర్థిక ప్రభంజనం తాజా గణాంకాలను లోతుగా విశ్లేషిస్తే, అర్థమవుతుంది. అపెడా, అగ్రి ఎక్స్చేంజ్ తదితర వ్యవసాయ మార్పిడి సంస్థల అధికారిక లెక్కల ప్రకారం.. 202425 ఆర్థిక సంవత్సరానికి గాను దేశ వ్యాప్తంగా ఏకంగా 231.43 లక్షల టన్నుల మామిడి ఉత్పత్తి అవుతుందని అంచనా. ఇంత భారీ స్థాయిలో దిగుబడి సాధించడం భారతీయ రైతుల దార్శనికతకు నిదర్శనం. దేశంలోని మొత్తం మామిడి ఉత్పత్తిలో సగానికి పైగా వాటాను కేవలం రెండు రాష్ట్రాలు మాత్రమే తమ సొంతం చేసుకోవడం గమనార్హం. ఇందులో ఉత్తరప్రదేశ్ ఏకంగా 26.56 శాతం భారీ వాటాతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా, మట్టిని నమ్ముకున్న మన ఆంధ్రప్రదేశ్ రైతాంగం 21.55 శాతం ఉత్పత్తితో దేశంలోనే బలమైన రెండో శక్తిగా సత్తా చాటుతోంది. ఇక తెలంగాణ రాష్ట్రం సైతం 4.55 శాతం వాటాతో మామిడి సాగులో తనదైన ఉనికిని చాటుకుంటోంది. మిగిలిన ఉత్పత్తిలో కర్ణాటక (6.81%), బీహార్ (6.85%), గుజరాత్ (5.50%), పశ్చిమ బెంగాల్ (4.67%), మధ్యప్రదేశ్ (4.11%), ఒడిశా (4.02%), తమిళనాడు (4.39%) రాష్ట్రాలు వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు కీలక దన్నుగా నిలుస్తున్నాయి.

**ఉత్తరాదిలో..**

ఉత్తరాది, పశ్చిమ రాష్ట్రాల మామిడి సాగును పరిశీలిస్తే ఎన్నో అద్భుతమైన రకాలు కనువిందు చేస్తాయి. ఉత్తరప్రదేశ్, హరియాణా, పంజాబ్ రాష్ట్రాల్లో విరివిగా పండే 'దశేహరి' రకం, పీచు లేకుండా స్వచ్ఛమైన మామిడి మాధుర్యాన్ని పంచుతుంది. ఇది ప్రధానంగా తాజా వినియోగానికి అత్యంత అనువైనది. అలాగే, గుజరాత్ రాష్ట్ర వ్యవసాయ ముఖచిత్రాన్ని మార్చిన 'కేసర్', 'వనరాజ్' రకాలు వాణిజ్య పరంగా ఎంతో ప్రసిద్ధి చెందాయి. ముఖ్యంగా ఎర్రటి ఛాయతో ఆకర్షణీయంగా కనిపించే కేసర్ రకం, గుజ్జు (పల్ప్), జ్యూస్ తయారీ పరిశ్రమలకు ప్రాణధారంగా నిలుస్తోంది. ఇక మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటకల్లో పండే 'అల్ఫోన్సో' (హాపుస్) గురించి ప్రత్యేకంగా ప్రస్తావించాలి. అత్యుత్తమ నిల్వ సామర్థ్యం, ప్రీమియం నాణ్యత కలిగిన ఈ రకం అంతర్జాతీయ ఎగుమతుల్లో భారతదేశ కీర్తిపతాకగా వెలుగొందుతోంది. బీహార్, బెంగాల్, మధ్యప్రదేశ్ ప్రాంతాల్లో దొరికే 'బొంబాయి' (మాల్దా), పచ్చటి రంగులో ఉండే ఉత్తరప్రదేశ్ కు చెందిన 'బొంబాయి గ్రీన్' భిన్నమైన రుచులతో వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి.


### సౌత్ ఆదర్శం

ఇక దక్షిణాది రాష్ట్రాల విషయానికి వస్తే, వాణిజ్య మామిడి సాగులో ఇక్కడి రైతులు అవలంబిస్తున్న విధానాలు ఎంతో ఆదర్శనీయం. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో పండే 'బంగినపల్లి' (బనేషాన్, సఫేదా) మామిడికి దేశవ్యాప్తంగానే కాకుండా ఎగుమతుల పరంగా కూడా ఎంతో విశేషమైన ఆదరణ ఉంది. పొడి వాతావరణాన్ని సైతం తట్టుకుని నిలబడే ఈ పండ్లు నిల్వ ఉంచేందుకు, క్యానింగ్ కు ఎంతో అనుకూలమైనవి. ప్రాసెసింగ్ పరిశ్రమల ఆధారంగా సాగే సాగులో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడులో పండే 'బెంగుళూర' లేదా 'తోతాపురి' రకానిదే ఏకఛత్రాధిపత్యం. అలాగే, ఒడిశా, ఏపీ వ్యవసాయ క్షేత్రాల్లో పండే 'సువర్ణరేఖ', తమిళనాడు, కర్ణాటకలకు పరిమితమైన భారీ సైజు పండు 'ముల్గోవా' తమ అద్భుతమైన రుచితో భోజన ప్రియులను కట్టిపడేస్తూ మార్కెట్లో స్థిరమైన డిమాండ్ ను కాపాడుకుంటున్నాయి. భౌగోళిక వైవిధ్యానికి ప్రతిరూపంగా నిలిచే గోవా, మహారాష్ట్ర తీరప్రాంతాల్లో దొరికే 'మాన్‌కుర్' రకానికి ఒక ప్రత్యేకమైన చారిత్రక నేపథ్యం ఉంది. పోర్చుగీసు పదమైన 'మాల్కొరాడో' (పేలవమైన రంగు) నుంచి కాలక్రమంలో ఈ పేరు రూపాంతరం చెందింది. వర్షాకాలంలో ఈ పండ్ల మీద నల్లటి మచ్చలు రావడం దీని సహజ, ప్రామాణిక లక్షణం. అలాగే, గోవాకే చెందిన పసుపు, ఎరుపు రంగుల సమ్మేళనంతో ఉండే 'ఫెర్నాండిన్' స్థానిక మార్కెట్లలో రారాజుగా వెలుగొందుతోంది. ఇలా అల్ఫోన్సో నుంచి లంగ్రా వరకు, తోతాపురి నుంచి దశేహరి వరకు.. ఏ రకమైనా, ఏ ప్రాంతమైనా మామిడి పండు కేవలం ఒక ఫలంగానే కాకుండా, లక్షలాది మంది రైతుల జీవనాధారంగా, కోట్లాది రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించిపెట్టే ఆర్థిక వనరుగా నిలుస్తూ భారతావని కీర్తిని దశదిశలా వ్యాప్తి చేస్తోంది.









# వేల కోట్ల కొనుగోళ్ల కుంభకోణం

- బస్తాకు నాలుగు కిలోల దోపిడీ.. ఆ పది శాతం వడ్లు ఎవరి జేబుల్లోకి?
- దళారులతో ప్రభుత్వ కుమ్మక్కుపై బీజేపీ సూటి ప్రశ్న.
- దమ్ముంటే నాతో రా.. వాస్తవాలు చూపిస్తా.
- 80 శాతం కొనుగోళ్లంటూ రైతులను మోసం చేస్తున్న సీఎం రేవంత్‌కు సవాల్.
- రైతన్నకు భరోసాగా కమలదళం సమరశంఖం.
- సోమవారం నుంచి కొనుగోలు కేంద్రాల బాట పట్టనున్న బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు.
- కాంగ్రెస్ సర్కార్‌పై భగ్గుమన్న బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి.

**హైదరాబాద్, మహా :**
రాష్ట్రంలో రైతన్నల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు అన్నదాతలు పడుతున్న అవస్థలు చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది. దళారుల దోపిడీ, రాష్ట్ర ప్రభుత్వ అంతులేని నిర్లక్ష్యం మధ్య రైతులు తీవ్రంగా నలిగిపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్న కొనుగోళ్ల లెక్కలన్నీ కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని, క్షేత్రస్థాయిలో వాస్తవాలు పూర్తి భిన్నంగా ఉన్నాయని భారతీయ జనతా పార్టీ శాసనసభాపక్ష (బీజేఎల్పీ) నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్న 80 శాతం కొనుగోళ్ల లెక్కలన్నీ పచ్చి అబద్ధాలని, దమ్ముంటే తమతో వచ్చి క్షేత్రస్థాయిలో వాస్తవాలు చూడాలని సవాల్ విసిరారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలను ఎండగడుతూ పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తేలా పలు సంచలన ఆరోపణలు చేశారు.

**కల్లాల్లో అన్నదాతల కన్నీటి గోస**
ఒకవైపు అకాల వర్షాలు, మరోవైపు జూన్‌లో ముంచుకొస్తున్న రుతుపవనాలతో మాన్సూన్‌కు సిద్ధం కావాల్సిన రైతులు తీవ్ర ఆందోళనలో ఉంటే, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం చోద్యం చూస్తోందని మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా వడ్లు, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు సక్రమంగా పనిచేయడం లేదని, లారీలు మరియు అత్యవసరమైన గన్నీ బ్యాగుల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం జొన్నల కొనుగోలు కేంద్రాలను ఇప్పటివరకు ప్రారంభించకపోవడంతో రైతులు మార్కెట్ యార్డుల్లోనే కుప్పలు పోసుకుని రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పది రకాల పంటలకు గిట్టుబాటు ధర ఇస్తామని, ప్రతి గింజను కొనుగోలు చేస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ పార్టీ.. నేడు ఆ హామీలను గాలికొదిలేసిందని, ఎకరానికి రూ.7,500 ఇస్తామన్న రైతు భరోసాను సైతం అటకెక్కించి రైతులను నట్టేట ముంచిందని తీవ్రస్థాయిలో విమర్శించారు.

***సీఎం రేవంత్ లెక్కలన్నీ పచ్చి అబద్ధాలే***
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా మీడియా ముందుకు వచ్చి రాష్ట్రంలో 80 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయని ప్రకటించడం పట్ల మహేశ్వర్ రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారుల తప్పుడు నివేదికలను పట్టుకుని ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజలను, రైతులను దారుణంగా తప్పుదారి పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఇప్పటివరకు కేవలం 24 శాతం మాత్రమే వడ్ల కొనుగోలు జరిగిందని ఆయన కుండబద్దలు కొట్టారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1.41 కోట్ల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తే, గతేడాది 90 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించారని, ఈ ఏడాది కూడా అదే లక్ష్యంగా పెట్టుకున్నా ముఖ్యమంత్రి చెబుతున్న 45 లక్షల మెట్రిక్ టన్నుల లెక్క ప్రకారం చూసినా అది కేవలం 30 నుంచి 35 శాతం మాత్రమే అవుతుందని గణాంకాలతో సహా వివరించారు. అలాంటప్పుడు ఏ ముఖం పెట్టుకుని 80 శాతం కొనుగోళ్లు జరిగాయని ముఖ్యమంత్రి చెబుతున్నారో సమాధానం చెప్పాలన్నారు.

**దమ్ముంటే నాతో రా.. వాస్తవాలు చూపిస్తా**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి సూటి సవాల్ విసిరారు. నిజంగా 80 శాతం కొనుగోళ్లు జరిగి ఉంటే, ముఖ్యమంత్రి ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తామని, ఆ లెక్కలను నిరూపించగలరా అని నిలదీశారు. లేదంటే ముఖ్యమంత్రి తమతో పాటు క్షేత్రస్థాయికి వస్తే అసలు వాస్తవాలు ఏమిటో, రైతులు ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో కళ్లకు కట్టినట్లు చూపిస్తామని సవాల్ చేశారు. కేవలం మాటల గారడీతో, తప్పుడు ప్రకటనలతో కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలను మభ్యపెట్టే కుటిల ప్రయత్నం చేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల గోస కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టకపోయినా, బీజేపీ ఎల్లప్పుడూ వారికి కొండంత అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

*బస్తాకు నాలుగు కిలోల కోత.. ఆ వేల కోట్లు ఎవరివి?*
ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న అత్యంత దారుణమైన దోపిడీని మహేశ్వర్ రెడ్డి బట్టబయలు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరుతో ప్రతి బస్తాకు అదనంగా నాలుగు కిలోల వడ్లను నిస్సిగ్గుగా కోత పెడుతున్నారని ఆరోపించారు. ఈ లెక్కన రైతు ఆరుగాలం శ్రమించి పండించిన మొత్తం పంటలో పది శాతం వడ్లు కేంద్రాల్లోనే అదృశ్యమవుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన 90 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్ల లక్ష్యంలో ఈ పది శాతం అంటే ఏకంగా 9 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మిల్లర్లు, దళారులతో కుమ్మక్కై సాగుతున్న ఈ వేల కోట్ల రూపాయల దందా వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు తక్షణమే వివరణ ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు.

*అన్నదాతకు అండగా బీజేపీ సమరశంఖం*
ప్రభుత్వ నిర్లక్ష్యానికి బలవుతున్న రైతాంగానికి భరోసా కల్పించేందుకు భారతీయ జనతా పార్టీ కార్యోన్ముఖమైందని మహేశ్వర్ రెడ్డి ప్రకటించారు. ఆరుగాలం శ్రమించిన రైతును ఆదుకోవడంలో రాష్ట్ర సర్కార్ పూర్తిగా విఫలమైన నేపథ్యంలో, బీజేపీ ఎల్పీ పక్షాన క్షేత్రస్థాయి పోరాటానికి శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించారు. సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని వడ్లు, మొక్కజొన్న, జొన్న కొనుగోలు కేంద్రాల్లో బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు విస్తృతంగా పర్యటించబోతున్నారని ప్రకటించారు. తొలిరోజు బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు నేతృత్వంలో ఈ పర్యటనలు ప్రారంభమవుతాయని, మూడు రోజుల పాటు సాగే ఈ పర్యటనల ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను బట్టబయలు చేస్తామని తెలిపారు.

**ప్రజల ముందుకు వాస్తవాలు.. తదుపరి భవిష్యత్ కార్యాచరణ**

ఈ మూడు రోజుల క్షేత్రస్థాయి పర్యటనల్లో వడ్ల కొనుగోలు వాస్తవంగా ఎంత జరిగింది, మొక్కజొన్న ఎందుకు సరిగ్గా కొనడం లేదు, జొన్నల కొనుగోలు కేంద్రాలు ఎందుకు ప్రారంభించలేదు తదితర అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించి ఆ వాస్తవాలను రాష్ట్ర ప్రజల ముందుకు తీసుకువస్తామని మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. కేవలం వాస్తవాలు తెలుసుకోవడమే కాకుండా, కన్నీరు పెడుతున్న రైతన్నకు భారతీయ జనతా పార్టీ అండగా నిలిచి పోరాడుతుందని హామీ ఇచ్చారు. ఈ మూడు రోజుల పరిశీలన అనంతరం కూడా ముఖ్యమంత్రి మొండివైఖరి వీడి స్పందించకపోతే, వ్యవసాయంపై, రైతుల సమస్యలపై పార్టీ తదుపరి భవిష్యత్ కార్యాచరణను కూడా మరో రెండు రోజుల్లోనే ప్రకటిస్తామని ఆయన కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక జారీ చేశారు.



## వైభవంగా శ్రీ ధన మైసమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవం

**వేడుకల్లో పాలుపంచు కుంటున్న దాతలు**
మహా వరంగల్ బ్యూరో : వరంగల్ 34 వ డివిజన్ లోని మెట్లు బావి శ్రీ ధన మైసమ్మ దేవాలయ తృతీయ వార్షికోత్సవాలు దాతల సహకారంతో ఆలయ అధ్యక్షులు తోట బాబన్న సంధ్య, దంపతుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మొదటిరోజు విగ్రహాల ఊరేగింపుకు దాతలుగా మాడిశెట్టి శ్రీనివాస్ శ్రీవాణి దంపతులు కేరళ నుండి ప్రత్యేక బ్యాండ్ మేళాను వినియోగించారు. అలాగే రెండవ రోజు అమ్మవారి విగ్రహాల ఊరేగింపులో ఉత్సవ రథాన్ని ఏర్పాటు చేయడంలో దాతలుగా దుబాసి విజేందర్, కీర్తన దంపతులు ఉత్సవ రథాన్ని పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షులు తోట బాబన్న మాట్లాడుతూ శ్రీ ధన మైసమ్మ అమ్మవారి కృపా కటాక్షాలతో రాధాకృష్ణ ఆటో స్పేర్ పార్ట్స్ ప్రొప్రైటర్ దుబాసి విజేందర్ కీర్తన దంపతులు, వారి కుమార్తె అక్షిత, కుమారుడు సాయి దీప్ కుటుంబ సభ్యుల కోరిన కోరికలు తీర్చడంతో వారు అమ్మవారి తృతీయ వార్షికోత్సవ కర పత్రికను చూసి వెంటనే తృతీయ వార్షికోత్సవ కార్యక్రమాలలో విగ్రహాల ఊరేగింపు రథాన్ని ఏర్పాటు చేస్తున్నందుకుగాను వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు వీరందరి పై ఉండాలని అమ్మవారిని కోరుకుంటున్నాం. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త చుంచు మూర్తి, దాతలు నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



## విగ్రహాలతో బీఆర్ఎస్ సరికొత్త డ్రామా

- ఎమ్మెల్యే నాయిని పై నిరాధార ఆరోపణలు మానుకోండి
- విగ్రాల పేరుతో రాజకీయ పబ్బం గడుపుకోవడం సిగ్గుచేటు
- డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి

**మహా వరంగల్ బ్యూరో :** హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన హనుమకొండ జిల్లా డిసిసి అధ్యక్షులు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాం రెడ్డి తనదైన శైలిలో బిఆర్ఎస్, బిజెపి పార్టీలపై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజా క్షేత్రంలో బాధ్యతాయుతంగా పనిచేస్తున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పై నిరాధార ఆరోపణలు, అవాక్కులు చేస్తే కాంగ్రెస్ పార్టీ సహించబోదని స్పష్టం చేశారు. అడ్డిమార్ గుడ్డి తో గెలిచిన నాయకుడు నాయిని కాదని, కాంగ్రెస్ పార్టీ నే నమ్ముకుని ప్రజల ఆశీస్సులతో గెలిచి అభివృద్ధి కోసం అహర్నిశలు పనిచేస్తున్న నాయకుడని పేర్కొన్నారు. ఆలయ వ్యవహారాలకు సంబంధం లేని ఎమ్మెల్యే ని ఉద్దేశపూర్వకంగా లాగడం ఇది రాజకీయ కుట్రలో భాగమే అని విమర్శించారు. విగ్రహాల పేరుతో రాజకీయ పబ్బం గడపాలని కొందరు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. నిజంగా పురాతన విగ్రహాలు బయటపడితే దేవాదాయ, పురావస్తు శాఖ అధికారులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నించారు. ప్రభుత్వ భూములను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే కృషి చేస్తుంటే, కొందరు రెడీమేడ్ విగ్రహాలను తీసుకొచ్చి రాజకీయ నాటకాలకు తెరలేపుతున్నారనిమండిపడ్డారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించిన ఆయన, కేటీఆర్ సర్వేల్లో గ్రాఫ్ పడిపోవడంతో కొత్త డ్రామాలకు శ్రీకారం చుడుతున్నారని విమర్శించారు. నగరంలోని ఖాళీ స్థలాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని అన్నారు. న్యూ శాయంపేట హనుమాన్ ఆలయానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సొంత ఖర్చులతో నిధులు అందించారని గుర్తుచేశారు. ఎమ్మెల్యే నాయినికి ఉన్న భక్తి, నిబద్ధత ఎంత ఉందో ప్రజలకు తెలుసని పేర్కొన్నారు. మొత్తం ఆలయ వ్యవహారంలో నిజమైన హనుమాన్ భక్తుడు ఒక్కరే ఉన్నారని, మిగతా హడావుడి అంతా బీఆర్ఎస్ నేతల రాజకీయ ప్రదర్శన మాత్రమేనని విమర్శించారు. రాజస్థాన్లో విగ్రహాలు తయారు చేయించి, వాటికి సంబంధించి సొంత పార్టీ నేతలే డబ్బులు పంపిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. యువతకు చెత్త రాజకీయ సందేశాలు ఇవ్వడం మానుకోవాలని సూచించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని అసత్య ప్రచారాలతో కాంగ్రెస్ పార్టీని, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ని దెబ్బతీయాలని చూస్తే సహించబోమని హెచ్చరించారు.

## ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హుడికి అందించడమే లక్ష్యం

- అభివృద్ధికి భవిష్యత్తు ప్రణాళికలు సిద్ధం చేయాలి
- జిల్లాలో సమర్థవంతంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక
- జిల్లా కలెక్టర్



**కరీంనగర్ మహా:** ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం సమర్థవంతంగా జరిగిందని, క్షేత్రస్థాయిలో పర్యటించిన అధికారులు తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి భవిష్యత్తు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా స్థాయి సభ శుక్రవారం జరిగింది.

ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంతో కలిసి హాజరయ్యారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొత్తం 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా 10 అంశాలతో ఈ కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అధికారులు ప్రతి గ్రామం పర్యటించి ప్రజలతో మమేకమయ్యారని, వారి సమస్యలు తెలుసుకున్నారని, అవసరాలను గుర్తించారని పేర్కొన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో సభలు, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం వంటి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు. నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. అందుకు అవసరమైన నిధులు విడుదల చేయాలని కోరారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ అధికారులు ప్రజలతో మమేకమై అనేక సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించారన్నారు. మరిన్ని పెండింగ్ సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖలో ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటారని తెలిపారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలు ట్రాఫిక్ నిబంధనలపై విస్తృత అవగాహన కల్పించామని అన్నారు. సుమారు 1500 మంది డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి 500 మందికి కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ 66 డివిజన్లలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం ద్వారా సానిటేషన్‌ని మెరుగుపరిచామని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ సునీల్ రావు, అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాసరెడ్డి, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు, మున్సిపల్ చైర్మన్లు మున్సిపల్ కమిషనర్లు, కార్పొరేటర్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

**సర్పంచుల సమస్యల పరిష్కారానికి హెల్ప్ డెస్క్**
గ్రామాల్లో సర్పంచులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్న ఈ హెల్ప్ డెస్క్ నిర్వహణ కోసం హెల్ప్ లైన్ నెంబర్లను కేటాయించి సర్పంచులకు తెలియజేయాలని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో సందర్శించి అసంపూర్తిగా ఉన్న గ్రామ పంచాయతీ భవనాల జాబితాను సిద్ధం చేయాలని తెలిపారు. వాటిని పూర్తి చేయించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. పంచాయతీ రాజ్ చట్టం 2018 ప్రకారం అన్ని గ్రామ పంచాయతీల జమా ఖర్చులను పర్యవేక్షించాలని, తద్వారా సిబ్బంది వేతనాలు, గ్రామపంచాయతీ విద్యుత్ బిల్లులు వంటివి సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు.



## క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**యాదాద్రి భువనగిరి మే 22 మహా**

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని SLNS కాలేజీ గ్రౌండ్‌లో హోటల్ చాలుక్య గ్రాండ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ను శుక్రవారం నాడు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు యువతలో క్రమశిక్షణ, జట్టు భావన, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు శారీరక, మానసిక దృఢత్వాన్ని కూడా పెంచుతాయని తెలిపారు. యువత క్రీడల్లో చురుకుగా పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో భువనగిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేస్ చిస్తీ , మున్సిపల్ చైర్పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ , పట్టణ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు మరియు పలువురు క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## వరి కొయ్యలను కాల్చవద్దు.. నేలతల్లిని కాపాడుకుందాం: పాలకుర్తి తాసిల్దార్ జే. సునీత

పాలకుర్తి, మే 22 పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలంలోని పంట కోతల అనంతరం పొలాల్లో వరి కొయ్యలు, ఇతర వ్యర్థాలను కాల్చివేయడం వల్ల భూసారం దెబ్బతింటుందని, పర్యావరణం కలుషితమవుతుందని పాలకుర్తి తాసిల్దార్ జే. సునీత హెచ్చరించారు. శుక్రవారం పాలకుర్తి తాసిల్దార్ కార్యాలయంలో వ్యవసాయ, రెవెన్యూ మరియు పోలీస్ శాఖల ఆధ్వర్యంలో 'వరి కొయ్యల దహనం దుష్పరిణామాలు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ రూపొందించిన అవగాహన పోస్టర్‌ను వారు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ జే. సునీత మాట్లాడుతూ, వరి కొయ్యలను కాల్చడం వల్ల నేలలోని సూక్ష్మజీవులు చనిపోయి భూమి నిర్వీర్యమవుతుందని తెలిపారు. ఏవో బండి ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ, వ్యర్థాలను కాల్చడం వల్ల నేల సారం కోల్పోయి, ఎరువులు వాడినా మొక్కలకు అందవు. కొయ్యకాలను కాల్చకుండా పాడి మల్చర్, రోటావేటర్ యంత్రాలను వాడి భూమిలో కలియదున్నడం వల్ల భూసారం పెరుగుతుంది అని వివరించారు. SI బసంత నగర్ నూతి శ్రీధర్ మాట్లాడుతూ, వరి కొయ్యలను కాల్చడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు అతిక్రమించిన వారిపై జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.





## 23 న సీఎం రేవంత్ రెడ్డి యాదగిరిగుట్ట పర్యటన...

**ఏర్పాట్లను పరిశీలించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**

**యాదాద్రి భువనగిరి మే 22 మహా** : యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టకు మే23 ఉదయం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పర్యటన ఏర్పాట్లను శుక్రవారం క్షుణ్ణంగా పరిశీలించారు.ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా సాగేందుకు అధికారులు చేపట్టిన ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య యాదగిరిగుట్ట టెంపుల్ సిటీ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, భద్రతా చర్యలు, పారిశుధ్య నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలను పరిశీలించారు. అలాగే ముఖ్యమంత్రి రాక కోసం ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను సందర్శించి, అక్కడ చేపట్టిన సదుపాయాలను పరిశీలించారు. హెలిప్యాడ్ వద్ద భద్రతా ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకలకు సంబంధించిన మార్గదర్శకాలను అధికారులతో చర్చించి అవసరమైన సూచనలు చేశారు.

## బెల్లీ లలిత విగ్రహానికి స్థలం పరిశీలించిన భువనగిరి ఎమ్మెల్యే

**యాదాద్రి భువనగిరి మే 22 మహా**
తెలంగాణ గాన కోకిల బెల్లి లలితక్క 52వ జయంతిని పురస్కరించుకొని భువనగిరి పట్టణంలో ఏర్పాటు చేయనున్న ఆమె విగ్రహానికి కావలసిన స్థలాన్ని శుక్రవారం భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి,లలితక్క కుటుంబ సభ్యులు మరియు స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు.
ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులు, అమరుల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,కె. కేశవరావు అధ్యక్షతన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిన విషయాన్ని ఎమ్మెల్యే తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తి, మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, దళిత నాయకులు బట్టు రామచంద్రయ్య, కళాకారుని వెన్నెలతో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.





## ప్రత్యేక వైకల్యం గుర్తింపు కార్డుల కేంద్రాని ప్రారంభించిన భువనగిరి ఎమ్మెల్యే

**యాదాద్రి భువనగిరి మే 22 మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డుల జారీ కేంద్రాన్ని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు ఉన్న దివ్యాంగులకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు సులభంగా అందించాలనే లక్ష్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డుల ద్వారా దివ్యాంగులు వివిధ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు, రాయితీలు మరియు ఇతర సౌకర్యాలను పొందేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ సేవలను వినియోగించుకొని ప్రభుత్వ అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ భాస్కర రావు ,భువనగిరి జిల్లా గ్రంధాలయ చైర్మన్ అవేస్ చిస్తీ , మున్సిపల్ ఛైర్పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ ,వైస్ ఛైర్పర్సన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు,స్థానిక కౌన్సిలర్లు,భువనగిరి పట్టణ ప్రజాప్రతినిధులు,అధికారులు, మరియు వైద్య సిబ్బంది, పలువురు పాల్గొన్నారు.



## సీఎం రేవంత్ రెడ్డి యాదగిరిగుట్ట పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

**జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ**

**యాదాద్రి భువనగిరి మే 22 మహా :** ఈ నెల 23వ తేదీన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి క్షేత్రంలో టెంపుల్ సిటీ వద్ద వేద పాఠశాల శంకుస్థాపనకు విచ్చేస్తున్న సందర్భంగా ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయడం జరిగిందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి , జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ తెలిపారు.

కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పోలీస్ , రెవెన్యూ శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, ఇ ఇ అర్ అండ్ బి , ఎస్సీ ఇరిగేషన్, ట్రాన్స్ పోర్ట్, ఎలక్ట్రిసిటీ, ఫైర్, పంచాయితీ, ఈ ఈ పంచాయతీ రాజ్, వైద్య శాఖ, ట్రాన్స్ కో, హార్టికల్చర్ డిపిఆర్ఓ,సివిల్ సప్లై , ట్రాఫిక్ తదితర శాఖల అధికారులు తమకి కేటాయించిన విధులను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్వహించాలన్నారు.

ఎస్పీ అక్షాంశ్ యాదవ్ మాట్లాడుతూ వివిధ శాఖలు అధికారులు సంపూర్ణ సమన్వయంతో పకడ్బందీగా విధులు నిర్వహించాలన్నారు. టెంపుల్ సిటీ వద్ద హెలిప్యాడ్ అన్ని ఏర్పాట్లుచేయాలని ఆర్ అండ్ బి అధికారులను, భద్రత ఏర్పాట్లు, శాంతి భద్రతలు, పూర్తి స్థాయిలో పోలీస్ బందోబస్తును, భారీ కేడింగ్ పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖ అధికారులను, అగ్నిమాపక పరికరాలను , సేవలను అందుబాటులో ఉంచాలని అగ్నిమాపక శాఖను, అవసరమైన వైద్య ఏర్పాట్లు చేయాలని ఆరోగ్య శాఖను, రోడ్ల మరమ్మత్తుల పనులను అర్.అండ్.బి , అధికారులు , శానిటేషన్ పనులను పూర్తి చేయాలని, మున్సిపాలిటీ, జిల్లా పంచాయితీ శాఖ, ఈ ఏర్పాట్ల ను పక్కాగా నిర్వహించాలన్నారు.

## ప్రగతి ప్రణాళికతో జిల్లా అభివృద్ధికి బాటలు

**-కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్ మహా :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక తోనే జిల్లా అభివృద్ధికి బాటలు పడతాయని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు.శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, కార్యక్రమానికి సంబంధించిన ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. అనంతరం మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళికతోనే జిల్లా సమగ్రాభివృద్ధి సాధ్యపడుతుందని అన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు ప్రజలకు మెరుగ్గా అందించడమే ఈ ప్రణాళిక ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే గ్రామీణ, నియోజకవర్గ స్థాయిలలో సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో 99 రోజుల ప్రణాళికలో భాగంగా పారిశుధ్యం, పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్, విద్య, వైద్యం, 'అరైవ్ అలైవ్', రైతు వారోత్సవాల కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామని కలెక్టర్ వివరించారు.ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను, భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాల వివరాలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, భైంసా, ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్లు దత్తాద్రి, అంకం మౌనిక, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఫలాలు పేదలకు అందించాల్సిన బాధ్యత సర్పంచులదే

**ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**



**యాదాద్రి భువనగిరి మే 22 మహా :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక @99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయడం జరుగుతుందని ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య అన్నారు .రాష్ట్రగీతాన్ని ఆలపించారు. అనంతరం ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు.

శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు

ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన ప్రతి లబ్ధిదారులకు కేటాయించడం జరుగుతుందని, త్వరలో ప్రభుత్వం 2వ విడత ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. పింఛన్ దారుల జీవన ప్రామాణికరణ ప్రక్రియ కొనసాగుతుందని, నూతన పింఛన్ల కొరకు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పెద్దా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ ఫలాన్ని అర్హులైన ప్రతి పేద ప్రజలకు అందేలా సర్పంచులు, కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్మన్ లు గ్రామాలలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలన్నారు. గ్రామంలో ఏ సమస్య ఉందని అడిగి తెలుసుకుని సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలే కాకుండా గ్రామాల అభివృద్ధి కొరకు అనేక నిధులు కేటాయించడం జరుగుతుందని అన్నారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ను అమలు చేస్తుందన్నారు.

తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామెల్ మాట్లాడుతూ గృహజ్యోతి పథకంలో అర్హులైన లబ్ధిదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుందని, ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదిగేందుకు వివిధ వ్యాపార రంగాలలో రుణ సదుపాయం కల్పించి ప్రోత్సహించడం జరుగుతుందని. అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందించి చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని, రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, అర్హులైన వారు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు.

భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా రైతు భరోసా, రైతు బీమా పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతుందని, సన్న రకం వడ్లకు మద్దతు ధరతో పాటు 500 రూపాయల బోనస్ అదనంగా రైతులకు అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన నిరుపేదలు గౌరవంగా జీవించడం కోసం ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తుందని తెలిపారు. వేసవిలో ప్రజలకు త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడడం జరుగుతుంది .విద్య రంగ అభివృద్ధి దిశగా ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని, ప్రాథమిక పాఠశాల నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు ఉదయం అల్పాహారం పథకం త్వరలో ప్రారంభించడం జరుగుతుందని, పిల్లలలో పోషకాహార లోపాన్ని నియంత్రించేందుకు ఈ పథకం అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో నియోజకవర్గ పరిధిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను మంజూరిచేయడం జరిగిందని అన్నారు, ఈ పాఠశాలల ద్వారా విద్యార్థులకు మరింత మెరుగైన, సౌకర్యవంతమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరికి బీమా సదుపాయం కల్పించేలా ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని అన్నారు.జిల్లా సర్వతోముఖాభివృద్ధికి సమిష్టిగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలో ఎక్కడైనా నీటి సమస్య వస్తే వెంటనే సమస్య పరిష్కరించడానికి నిధులు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. బడిబాట కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలలో ఎక్కువ మంది విద్యార్థులను నమోదయ్యేలా చూడాలన్నారు. గ్రామాలలో గ్రామ పంచాయతీ భవనాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. మధ్యాహ్నం భోజన పథకంలో ఇంటర్మీడియట్ వరకు మంచి పౌష్టికాహారంతో భోజనం అందించడం జరుగుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళ కార్పొరేషన్ చైర్ పర్సన్ బండ్రు శోభారాణి , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ కలెక్టర్ వెంకరెడ్డి,జెడ్పి సి ఈ ఓ శోభారాణి,గ్రంధాలయం చైర్మన్ అవేజ్ చిస్తీ, ఆలేరు, మోత్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ లు చైతన్యమహేందర్ , విమల వెంకటేష్,భువనగిరి, ఆలేరు,యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్మన్ లు తంగెల్లపల్లి శ్రీవాణి, బాలమణి భాస్కర్, గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్, డి ఆర్ డి ఏ నాగిరెడ్డి, సర్పంచులు, కౌన్సిలర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యం కలెక్టర్ రాజర్షి షా



**దిలాబాద్ మహా :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా ప్రగతి ప్రణాళిక' ద్వారానే గ్రామాలు, పట్టణాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్టియు భవన్ లో నిర్వహించిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' జిల్లా స్థాయి సమావేశానికి ఎస్పీ అఖిల్ మహాజన్ ,మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష తో కలిసి ఆయన హాజరయ్యారు. గతంలో కంటే భిన్నంగా క్షేత్రస్థాయిలో ప్రజల నిజమైన అవసరాలను గుర్తించి, వాటికి అనుగుణంగా నిధుల కేటాయింపులు జరపడమే ఈ ప్రణాళిక యొక్క ముఖ్య ఉద్దేశమని వివరించారు. ప్రతి గ్రామానికి ఒక స్పష్టమైన, ఆచరణాత్మకమైన ప్రణాళిక ఉండాలని, దీని కోసం మండల, గ్రామ స్థాయి అధికారులు పరస్పరం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిధుల వినియోగంలో, పనుల గుర్తింపులో పూర్తి పారదర్శకత పాటించాలని స్పష్టం చేస్తూ, విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. ముఖ్యంగా గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ వంటి మౌలిక వసతుల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని దిశా నిర్దేశం చేశారు. వీటితో పాటు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల బలోపేతానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. హరితహారం, పారిశుధ్య నిర్వహణ పక్కాగా జరిగేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ ప్రజా ప్రగతి ప్రణాళికలో ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు చురుగ్గా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తక్షణమే గ్రామ సభలు నిర్వహించి, ప్రజల నుంచి నేరుగా వినతులు, సూచనలు స్వీకరించి సమగ్ర నివేదికలు రూపొందించాలని స్పష్టం చేశారు. నిర్ణీత గడువులోగా నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసి, ఆదిలాబాద్ జిల్లాను రాష్ట్రంలోనే ప్రగతిపథంలో ముందుంచడానికి ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేయాలని ఆకాంక్షించారు. అనంతరం మెగా జాబ్ మేళ ద్వారా ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు, పదవతరగతిలో అత్యధిక మార్కులను సాధించిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు, పుస్తకం, చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ గ్రామ పంచాయితీలకు ప్రశంస పత్రాలను అందజేశారు .ఈ సమావేశంలో ఐటీడీఏ పీవో మంద మకరంద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మునిసిపల్ కమీషనర్ జగదీశ్వర్ గౌడ్, వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు

## బెల్లంపల్లి పట్టణం అభివృద్ధి పథంలో వేగంగా సాగుతోంది

**బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు**



బెల్లంపల్లి ,మహా: బెల్లంపల్లి పట్టణం అభివృద్ధి పథంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సహకారంతో వేగంగా సాగుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు పేర్కొన్నారు .బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల "ప్రజా పాలనప్రగతి ప్రణాళిక" లో భాగంగా శుక్రవారం రోజున మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం .రేవంత్ రెడ్డి, బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి సారధ్యంలో బెల్లంపల్లి పట్టణం గతంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధిపథంలో ముందుకుసాగుతోందని అన్నారు.. మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యలను జిల్లా స్థాయి అధికారులకు సమగ్రంగా వివరించి, సమస్యలు పరిష్కరించేలా చూడాలని కోరారు.ముఖ్యంగా పట్టణ భూముల రిజిస్ట్రేషన్ గత కొంతకాలంగా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నారని, కాబట్టి పట్టణ భూముల రిజిస్ట్రేషన్ జరిగేలా చూడాలని కోరారు..కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ లు, జిల్లాలోని మున్సిపాలిటీల మున్సిపల్ చైర్ పర్సన్ లు, కౌన్సిల్ సభ్యులు, సర్పంచ్ లు, తదితరులు పాల్గొన్నారు.



## 18 కోట్ల 70 లక్షలతో అభివృద్ధి పనులు

ఆదిలాబాద్ మహా : ఆదిలాబాద్ పట్టణంలో యుఐడిఎఫ్ పథకం కింద 18 కోట్ల 70 లక్షలతో అభివృద్ధి పనులను స్థానిక యంపీ నగేష్,ఎమ్మెల్యే శంకర్ , మున్సిపల్ చైర్ పర్సన్ అనూష ప్రారంభించారు. అదిలాబాద్ పట్టణంలోని 33 వ వార్డులో 10 లక్షలతో , 36 వ వార్డ్ లో 30 లక్షలతో , 43వ వార్డ్ లో 39 లక్షలతో సిసి రోడ్లు డ్రైనేజీల పనులకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. పట్టణంలో కోటి పది లక్షల రూపాయల ఫ్లడ్ నిధులతో కల్వర్టులు ప్యాచ్ వర్క్ లు కొనసాగుతున్నాయన్నారు. అదేవిధంగా 49 కోట్ల రూపాయల టీయూఎఫ్ఐ డి సి పనులు టెండర్ దశలో ఉన్నాయన్నారు. ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో ముఖ్యమంత్రి ప్రత్యేక నిధులు మరో 100 కోట్ల రూపాయలు కూడా ప్రభుత్వం నుండి అనుమతులు వచ్చి వెంటనే పనులు ప్రారంభంఅవుతాయన్నారు. 49 వార్డులలో ఎక్కడ ఏ సమస్య లేకుండా చేస్తామని అన్ని కాలనీలలో రోడ్లు డ్రైనేజీలు , కల్వర్టులు నిర్మించే ప్రయత్నం చేస్తామని చైర్ పర్సన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డుల కౌన్సిలర్లు ప్రజలు పాల్గొన్నారు.



## సొసైటీపై అవగాహనారాహిత్య ఆరోపణలు తగవు ఏఎఫ్సీ జోనల్ ఆఫీసర్

**ఆదిలాబాద్ మహా :** సోసైటీ పేరుతో అక్రమ వసూళ్లు అని ఆరోపించిన చాంబర్ ఆఫ్ కామర్స్ నాయకుల వ్యాఖ్యలు అవగాహనా రాహిత్యమని ఆహార పరిరక్షణ ప్రమాణాల శాఖ ఏఎఫ్సీ జోనల్ ఆఫీసర్ నాయక్ అన్నారు. శుక్రవారం ఆయన ఆహార పరిరక్షణ ప్రమాణాల శాఖ అధికారులతో కలిసి ప్రెస్ క్లబ్లో మీడియాతో మాట్లాడారు. సోసైటీ అనేది ఒక స్వచ్ఛంద సంస్థ అని ఫుడ్ సేఫ్టీ స్టాండర్స్ అథారిటీ ఇండియా ద్వారా ఫోస్టాక్ ట్రైనింగ్ ఇచ్చుటకు అథారిటి కలిగిన సంస్థ అని తెలిపారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ దేశమంతా ఫుడ్ హ్యాండర్స్ కు ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లకి ఆహార భద్రత , స్వచ్ఛ ఆహారపు అలవాట్లను మెరుగు పరుచుటకు అన్ని రాష్ట్రాలలో ట్రైనింగ్ ఇచ్చుటకు అధికారం కలిగినటువంటి సంస్థ అన్నారు. ఈ సంస్థ వాలంటీర్లు ప్రతి వ్యాపారి , ఫుడ్ హాండర్లను నేరుగా కలిసి అవగాహన కల్పించిన అనంతరమే భారత ఆహార భద్రతా సంస్థ నిర్ణయించిన ఫీజును సేకరించి వారికి ట్రైనింగ్ , సర్టిఫికెట్ కు సిఫారసు చేసే అధికారము కలిగి ఉందని తెలిపారు. ఇతరులతో అవసరము లేకుండా కేవలం జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారుల పర్యవేక్షణలో, ఫుడ్ హాండ్లేర్లను ఆహార వ్యాపారం చేస్తున్న వారిని అవగాహన కల్పించి ట్రైనింగ్ ఇస్తారన్నారు. ఈ విషయం పై ఎటువంటి అవగాహన లేకుండా ఆదిలాబాద్ చాంబర్ ఆఫ్ కామర్స్ నుండి కొందరు ఆహార వ్యాపారస్తుల నుండి సొసైటీ వాలంటీర్లు అక్రమ వసూళ్ళకు పాల్పడుతున్నారని వ్యాఖ్యలు చేయడం వ్యాపారస్తులను అభద్రతాభావానికి గురి చేయడమే అన్నారు..సొసైటీ గత 30 సం.రాలుగా ప్రజల సేవలో ఒక బాధ్యత కలిగిన సంస్థగా గుర్తింపు పొందిదన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధికారులు పాల్గొన్నారు.

## వేతనాల పెంపులో శాస్త్రీయత లేదు

- పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెంచాలి.
- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు..



**రాజేంద్రనగర్ మహా :** ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు కార్మికుల వేతనాల పెంపుదలపై ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కార్మిక శాఖ పరిధిలోని షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్ కనీస వేతనాల పెంపుదలను ప్రకటించారు. సుమారు 14 సంల తరువాత రాష్ట్రంలో కనీస వేతనాలు సవరించడం ఆహ్వానించదగ్గ పరిణామం. జూన్ 2 నుండి సవరించిన వేతనాలు అమలు చేస్తామని ప్రకటించారు. కోటి 11 లక్షల మంది కార్మికులకు ప్రయోజనం కల్గుతుందని చెప్పారు. ప్రకటించిన వేతనాలు పెరిగిన ధరలకు, అనుగుణంగా కార్మికులు, కార్మిక సంఘాల చేసిన డిమాండ్ను పట్టించుకోకపోవడం తీవ్ర అసంతృప్తిని కలిగించిందన్నారు. ముఖ్యమంత్రి వేతనాల పెంపుదల కోసం క్యాబినెట్ సబ్ కమిటీ వేశామని, దేశానికే ఆదర్శవంగా ఉండేలా శాస్త్రీయ పద్ధతిలో కనీస వేతనాల పెంపుదల చేస్తామని ప్రకటించారు. ఆచరణలో చూస్తే ప్రకటించిన వేతనాలు శాస్త్రీయత లోపించింది. ఆశాస్త్రీయమైన పద్ధతిలో వేతనాలను ప్రకటించారు. పెరిగి ధరలకు కనీస వేతనాలు పెంచాలని ఏఐటియుసి తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తుందన్నారు.కనీస వేతనాలను రాష్ట్రంలో 3 జోన్స్లు గా విభజించారు. మున్సిపల్ కార్పొరేషన్స్, మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాలుగా విభజించి వేతనాలు వేరువేరుగా ప్రకటించడాన్ని ఏఐటీయూసీ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. కార్మిక సంఘాలు, కనీస వేతనాల సలహామండలి సిపార్సులను పరిగణలోకి తీసుకోకుండా మంత్రివర్గ ఉపసంఘం పేరిట కనీస వేతనాలు ప్రకటించారు.

# సన్ ఫార్మా బలమైన ఆర్థిక ఫలితాల

**నికర లాభం 26% పెరిగి ₹2,714 కోట్లు..**
**షేర్‌కు ₹5 డివిడెండ్ ప్రకటింపు**




ముంబై : దేశీయ ఔషధ దిగ్గజం సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్ 202526 ఆర్థిక సంవత్సర నాలుగో త్రైమాసికంలో బలమైన ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 26 శాతం పెరిగి ₹2,714 కోట్లకు చేరింది. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో విక్రయాల వృద్ధి, స్పెషాలిటీ బిజినెస్ మెరుగైన ప్రదర్శన ఈ వృద్ధికి ప్రధాన కారణాలుగా నిలిచాయి.త్రైమాసికంలో కంపెనీ ఆపరేషన్ల ద్వారా వచ్చిన ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం సుమారు ₹13,675 కోట్లకు చేరింది. భారత మార్కెట్లో బలమైన అమ్మకాలు, అమెరికా మార్కెట్లో మెరుగైన వ్యాపార పరిస్థితులు, స్పెషాలిటీ డ్రగ్ పోర్ట్‌ఫోలియోలో కొనసాగుతున్న వృద్ధి కంపెనీకి మద్దతు ఇచ్చాయి.

ఫలితాలతో పాటు కంపెనీ బోర్డు ఒక్కో ఈక్విటీ షేర్‌కు ₹5 తుది డివిడెండ్‌ను సిఫారసు చేసింది. రాబోయే వార్షిక సర్వసభ్య సమావేశంలో (ఏజీఎం) వాటాదారుల ఆమోదం అనంతరం డివిడెండ్ చెల్లించనున్నారు.దేశీయ వ్యాపారం సన్ ఫార్మా వృద్ధికి కీలక బలంగా కొనసాగింది. ముఖ్యంగా క్రానిక్ థెరపీలు, స్పెషాలిటీ సెగ్మెంట్లలో కంపెనీ తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది. పలు చికిత్సా విభాగాల్లో ఉత్పత్తుల శ్రేణిని విస్తరించడం కూడా వృద్ధికి తోడ్పడింది.

అంతర్జాతీయ స్పెషాలిటీ వ్యాపారం కూడా ప్రోత్సాహకర ఫలితాలను నమోదు చేసింది. ముఖ్యంగా డెర్మటాలజీ, ఆఫ్తాల్మాలజీ వంటి ప్రత్యేక చికిత్సా రంగాలకు చెందిన ఉత్పత్తులు మంచి ఆదరణ పొందాయి. ఆవిష్కరణలు, స్పెషాలిటీ విస్తరణ కంపెనీ దీర్ఘకాలిక వ్యూహంలో కీలకమని యాజమాన్యం తెలిపింది.

అమెరికా మార్కెట్లో ధరల ఒత్తిళ్లు, నియంత్రణ సంబంధిత సవాళ్లు కొనసాగుతున్నప్పటికీ, సన్ ఫార్మా వ్యాపారం మెరుగుదల సంకేతాలు చూపింది. విభిన్న ఉత్పత్తుల మిశ్రమం, స్పెషాలిటీ ఉత్పత్తులపై దృష్టి పెట్టడం వల్ల మార్జిన్ ఒత్తిళ్లను కంపెనీ సమర్థంగా ఎదుర్కొందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

ఆపరేషనల్ స్థాయిలో కూడా కంపెనీ లాభదాయకత మెరుగుపడింది. మెరుగైన ఉత్పత్తుల మిశ్రమం, వ్యయ నియంత్రణ, అధిక మార్జిన్ కలిగిన స్పెషాలిటీ ఉత్పత్తుల విక్రయాలు EBITDA మార్జిన్‌లను పెంచాయి. ఫలితాల అనంతరం మార్కెట్ వర్గాలు సానుకూలంగా స్పందించాయి. స్థిరమైన వృద్ధి దిశగా కంపెనీ కొనసాగుతోందనే సంకేతంగా పెట్టుబడిదారులు ఈ ఫలితాలను భావిస్తున్నారు. డివిడెండ్ ప్రకటన, స్థిరమైన ఆపరేషనల్ పనితీరు దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు అనుకూల అంశాలని విశ్లేషకులు పేర్కొన్నారు.

భవిష్యత్తు వృద్ధిపై కంపెనీ యాజమాన్యం విశ్వాసం వ్యక్తం చేసింది. స్పెషాలిటీ వ్యాపారం విస్తరణ, దేశీయ మార్కెట్లో బలమైన డిమాండ్, పరిశోధన-అభివృద్ధిపై పెట్టుబడులు కొనసాగుతాయని తెలిపింది. ప్రత్యేకత కలిగిన కొత్త ఉత్పత్తులను మార్కెట్లోకి తీసుకురావడంపై దృష్టి కొనసాగుతుందని పేర్కొంది.

మార్కెట్ విలువ పరంగా సన్ ఫార్మా ప్రస్తుతం దేశంలోనే అతిపెద్ద ఫార్మా కంపెనీగా కొనసాగుతోంది. గ్లోబల్ జనరిక్, స్పెషాలిటీ మెడిసిన్ రంగాల్లో కూడా ప్రముఖ స్థానం కలిగిన ఈ సంస్థ, రాబోయే త్రైమాసికాల్లో కూడా వృద్ధిని కొనసాగించే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

# సెన్సెక్స్ 232 పాయింట్లు లాభం



భారత స్టాక్ మార్కెట్లు శుక్రవారం లాభాల్లో ముగిశాయి. బ్యాంకింగ్, ఐటీ షేర్లలో బలమైన కొనుగోళ్లు కనిపించడంతో సూచీలు పాజిటివ్‌గా క్లోజ్ అయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలు, ముడి చమురు ధరలపై ఆందోళనలు తగ్గడం, గ్లోబల్ పరిణామాలపై ఆశావహ వాతావరణం పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను బలపరిచాయి.బీఎస్ఈ సెన్సెక్స్ సుమారు 232 పాయింట్లు లాభపడి 75,415 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 23,700 మార్కును దాటి ముగిసింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, విదేశీ పెట్టుబడిదారుల కొనుగోలు-అమ్మకాల ఒత్తిడి కొనసాగుతున్నప్పటికీ, ఈ వారం మొత్తం సూచీలు లాభాలను నమోదు చేశాయి.మార్కెట్ ర్యాలీకి బ్యాంకింగ్, ఫైనాన్షియల్ షేర్లు ప్రధాన బలం అందించాయి. ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లలో బలమైన కొనుగోళ్లు నమోదయ్యాయి. ఇటీవల వచ్చిన కరెక్షన్ తర్వాత పెద్ద బ్యాంకింగ్ షేర్లలో పెట్టుబడిదారులు మళ్లీ ఆసక్తి చూపినట్లు విశ్లేషకులు తెలిపారు. ఐటీ షేర్లు కూడా మార్కెట్‌కు మద్దతుగా నిలిచాయి. గ్లోబల్ టెక్నాలజీ ఖర్చులు, ఏఐ ప్రభావంపై వచ్చిన ఆందోళనలతో ఇటీవల ఒత్తిడిలో ఉన్న ఐటీ రంగం ఈ సెషన్‌లో కోలుకుంది. విప్రో షేర్ ఇతర ఐటీ కంపెనీలతో పోలిస్తే మెరుగైన ప్రదర్శన కనబరిచింది. త్రైమాసిక ఫలితాల ప్రభావంతో కొన్ని షేర్లు భారీ కదలికలు నమోదు చేశాయి. హొనాసా కన్స్యూమర్ బలమైన క్యూ4 ఫలితాలతో దూసుకెళ్లగా, రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ లాభాల పెరుగుదలతో గణనీయంగా ఎగబాకింది. డీఈఈ డెవలప్‌మెంట్ ఇంజినీర్స్, జీఎన్‌జీ ఎలక్ట్రానిక్స్ షేర్లు కూడా పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షించాయి.అమెరికా-ఇరాన్ చర్చల్లో పురోగతి కనిపిస్తున్నట్లు వచ్చిన వార్తలు గ్లోబల్ మార్కెట్లకు ఊరటనిచ్చాయి. దీంతో ముడి చమురు సరఫరాపై భయాలు తగ్గి ఆసియా మార్కెట్లలో రిస్క్ తీసుకునే ధోరణి పెరిగింది. బాండ్ యీల్డ్స్ తగ్గడం, రూపాయి బలపడడం కూడా దేశీయ మార్కెట్లకు మద్దతు ఇచ్చాయి.మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా లాభాల్లో ముగిశాయి. నిఫ్టీ కీలక టెక్నికల్ రెసిస్టెన్స్ స్థాయిలను అధిగమించడంతో పెట్టుబడిదారుల విశ్వాసం కొంత మెరుగుపడిందని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. అయితే భౌగోళిక రాజకీయ పరిస్థితులు, చమురు ధరల హెచ్చుతగ్గుల కారణంగా మార్కెట్లలో వోలాటిలిటీ ఇంకా కొనసాగవచ్చని హెచ్చరిస్తున్నారు.ఇకపై కార్పొరేట్ ఫలితాలు, ముడి చమురు ధరలు, గ్లోబల్ సెంట్రల్ బ్యాంకుల నిర్ణయాలు, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల కదలికలపై మార్కెట్ దృష్టి ఉండనుంది.

## ఇండక్షన్ ఉపకరణాల డిమాండ్‌తో టిటికే ప్రెస్టీజ్‌కు భారీ లాభాలు

వంటగది ఉపకరణాల తయారీ సంస్థ టిటికే ప్రెస్టీజ్ 202526 ఆర్థిక సంవత్సర నాలుగో త్రైమాసికంలో బలమైన ఫలితాలను నమోదు చేసింది. ఇండక్షన్ స్టౌవ్‌లు, ఎలక్ట్రిక్ కుకింగ్ ఉపకరణాలకు పెరిగిన డిమాండ్ కంపెనీ లాభాలను గణనీయంగా పెంచింది. ఎల్పీజీ సరఫరాపై కొనసాగుతున్న ఆందోళనలు వినియోగదారులను ప్రత్యామ్నాయ వంట పద్ధతులవైపు మళ్లించడంతో కంపెనీకి లాభం చేకూరింది.మార్చి త్రైమాసికంలో కంపెనీ లాభాలు గణనీయంగా పెరిగాయి. దేశీయ మార్కెట్లో వినియోగదారుల నుంచి వచ్చిన బలమైన డిమాండ్ కారణంగా ఆపరేషన్ల ద్వారా వచ్చిన ఆదాయం కూడా మంచి వృద్ధిని నమోదు చేసింది. ముఖ్యంగా ఇండక్షన్ కుక్‌టాప్స్, ఎలక్ట్రికల్ కుకింగ్ అప్లయెన్సెస్ విక్రయాలు భారీగా పెరిగాయి.కంపెనీ పన్నుల ముందు లాభం (ప్రాఫిట్ బిఫోర్ ట్యాక్స్ అండ్ ఎక్సెప్షనల్ ఐటమ్స్) ఏడాది ప్రాతిపదికన దాదాపు 29 శాతం పెరిగింది. మెరుగైన ఉత్పత్తుల మిశ్రమం, అధిక డిమాండ్ కారణంగా ఆపరేషనల్ మార్జిన్‌లు కూడా బలోపేతం అయ్యాయి.ఇండక్షన్ స్టౌవ్‌లకు పెరిగిన డిమాండ్ కంపెనీ వృద్ధికి ప్రధాన కారణంగా నిలిచింది. ఎల్పీజీ అందుబాటుపై సమస్యలు, ధరల ఆందోళనల కారణంగా గృహ వినియోగదారులు, వాణిజ్య వినియోగదారులు విద్యుత్ ఆధారిత వంట పరికరాలవైపు మళ్లడంతో ఇండక్షన్ అప్లయెన్సెస్ విక్రయాలు పెరిగాయి.దేశీయ విక్రయాలు డబుల్ డిజిట్ వృద్ధిని నమోదు చేయగా, ఎగుమతుల వ్యాపారం మాత్రం ఒత్తిడిని ఎదుర్కొంది. అంతర్జాతీయ షిప్పింగ్ అంతరాయాలు, విదేశీ మార్కెట్లలో టారిఫ్ సమస్యలు ఎగుమతులపై ప్రభావం చూపినట్లు కంపెనీ తెలిపింది.ఫలితాలతో పాటు టిటికే ప్రెస్టీజ్ తన వాటాదారులకు డివిడెండ్‌ను కూడా ప్రకటించింది. 202526 ఆర్థిక సంవత్సరానికి ఒక్కో ఈక్విటీ షేర్‌పై ₹7.50 డివిడెండ్‌ను బోర్డు సిఫారసు చేసింది. వాటాదారుల ఆమోదం అనంతరం డివిడెండ్ చెల్లించనున్నారు.ఫలితాల తర్వాత పెట్టుబడిదారులు సానుకూలంగా స్పందించడంతో కంపెనీ షేర్లు ట్రేడింగ్‌లో లాభపడ్డాయి. వినియోగదారుల డిమాండ్ మెరుగుపడుతున్న సంకేతంగా మార్కెట్ వర్గాలు ఈ ఫలితాలను విశ్లేషించాయి.ఇటీవలి కాలంలో ఇండక్షన్ ఆధారిత వంట పరికరాల వినియోగం పెరగడం మొత్తం కిచెన్ అప్లయెన్సెస్ రంగానికి ఊతమిచ్చిందని విశ్లేషకులు చెబుతున్నారు. పలు రిటైల్, ఈకామర్స్ వేదికలు కూడా ఇండక్షన్ కుక్‌టాప్స్‌కు భారీ డిమాండ్ నమోదైందని పేర్కొంటున్నాయి. అధిక విక్రయాల కారణంగా కొన్ని ఉత్పత్తులకు తాత్కాలిక కొరత కూడా ఏర్పడినట్లు సమాచారం. భారతదేశవ్యాప్తంగా బలమైన బ్రాండ్ ఇమేజ్, విస్తృత పంపిణీ వ్యవస్థ ఉండటం టిటికే ప్రెస్టీజ్‌కు ప్రధాన బలంగా మారింది. ప్రెషర్ కుకర్లు, ఇండక్షన్ స్టౌవ్‌లు, కుక్‌వేర్, ఎలక్ట్రిక్ కిచెన్ అప్లయెన్సెస్ విభాగాల్లో కంపెనీ తన ఉత్పత్తుల శ్రేణిని విస్తరిస్తోంది.అయితే ఎగుమతి మార్కెట్లలో సవాళ్లు, ముడి పదార్థాల ధరల పెరుగుదల వంటి అంశాలు ఇంకా ఒత్తిడిగా ఉన్నాయని కంపెనీ తెలిపింది. అయినప్పటికీ దేశీయ మార్కెట్లో ఎనర్జీ ఎఫిషియెంట్ వంట పద్ధతులవైపు వినియోగదారులు వేగంగా మళ్లుతున్నందున భవిష్యత్తుపై యాజమాన్యం ఆశాభావం వ్యక్తం చేసింది.లాభాల పెరుగుదల, ఇండక్షన్ ఉపకరణాల డిమాండ్, విద్యుత్ ఆధారిత వంట పరికరాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో టిటికే ప్రెస్టీజ్ రాబోయే త్రైమాసికాల్లో కూడా వృద్ధి అవకాశాలు ఉన్న కంపెనీగా మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

# సంస్కరణలు, 'వికసిత భారత్' లక్ష్యంపై ప్రధానంగా చర్చ



న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దేశవ్యాప్తంగా "ఈజ్ ఆఫ్ లివింగ్" (జీవన సౌలభ్యం), "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" (వ్యాపార సౌలభ్యం) మెరుగుపరిచే అంశాలపై ప్రధానంగా చర్చించారు.సమావేశం అనంతరం ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో వివరాలు వెల్లడించారు. మంత్రులు పరిపాలనా సంస్కరణలు, ప్రజా సేవల మెరుగుదల, పాలనలో సమర్థత పెంపు వంటి అంశాలపై విలువైన సూచనలు, అనుభవాలను పంచుకున్నారని తెలిపారు. సమావేశం ఫలప్రదంగా సాగిందని పేర్కొన్నారు.ప్రజల దైనందిన జీవితాన్ని మరింత సులభతరం చేయడంతో పాటు దేశంలో పెట్టుబడులు, వ్యాపారాలకు అనుకూల వాతావరణాన్ని కల్పించడంపై సమావేశంలో ప్రత్యేక దృష్టి సారించినట్లు ప్రధాని తెలిపారు. ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయడానికి సంస్కరణలు కొనసాగించడం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

"వికసిత భారత్" లక్ష్య సాధనకు దీర్ఘకాలిక ప్రణాళికలపై కూడా సమావేశంలో చర్చించినట్లు సమాచారం. పరిపాలనా సామర్థ్యాన్ని పెంచడం, [illegible] యాల అభివృద్ధి, విధాన సరళీకరణ, వివిధ రంగాల్లో ఆవిష్కరణలను ప్రోత్సహించడం వంటి అంశాలు సమావేశంలో ప్రాధాన్యం పొందాయి.గత కొన్ని సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం డిజిటల్ పాలన, మౌలిక వసతుల విస్తరణ, తయారీ రంగ అభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహం, వ్యాపార అనుకూల విధానాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. అంతర్జాతీయ స్థాయిలో భారత వ్యాపార పోటీతత్వాన్ని పెంచేందుకు పలు విధాన సంస్కరణలను అమలు చేస్తోంది.అధికార యంత్రాంగంలో ఆలస్యాలు తగ్గించడం, ప్రజలకు సేవలను మరింత [illegible] ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటిగా ఉందని కేంద్ర ప్రభుత్వం పలు సందర్భాల్లో స్పష్టం చేసింది. డిజిటలైజేషన్, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్, స్టార్టప్‌ల ప్రోత్సాహం, వేగవంతమైన అనుమతుల వ్యవస్థ వంటి చర్యలు ఈ దిశగా కీలకంగా నిలిచాయని అధికారులు పేర్కొంటున్నారు.

"వికసిత భారత్" భావన ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ దీర్ఘకాలిక అభివృద్ధి కార్యాచరణలో కీలక అంశంగా మారింది. ఆర్థిక వృద్ధి, సాంకేతిక పురోగతి, ఉపాధి అవకాశాల పెంపు, మౌలిక సదుపాయాల ఆధునికీకరణ, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది.ఇలాంటి మంత్రివర్గ సమావేశాలు వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని పెంచి, సంస్కరణల అమలును వేగవంతం చేస్తాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాబోయే కాలంలో కూడా కేంద్ర ప్రభుత్వం పరిపాలనా సామర్థ్య పెంపు, ఆర్థిక సంస్కరణలపై దృష్టి కొనసాగించే అవకాశం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు.

# ఢిల్లీలో క్వాడ్ విదేశాంగ మంత్రుల సమావేశం

**భారత్‌కు రానున్న అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో**



న్యూఢిల్లీ : ఇండోపసిఫిక్ ప్రాంతీయ వ్యూహం, భద్రత, వాణిజ్యం, వ్యూహాత్మక భాగస్వామ్యంపై కీలక చర్చల కోసం క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశం మే 26న న్యూఢిల్లీలో జరగనుంది. ఈ సమావేశానికి అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రులు హాజరుకానున్నారు.అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో మే 23 నుంచి 26 వరకు భారత్ పర్యటనకు రానున్నారు. అమెరికా విదేశాంగ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన భారత్‌కు రావడం ఇదే మొదటిసారి. ఈ పర్యటన భారత్-అమెరికా సంబంధాల బలోపేతానికి కీలకంగా మారుతుందని దౌత్య వర్గాలు భావిస్తున్నాయి.ఈ సమావేశానికి భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఆతిథ్యం ఇవ్వనుండగా, ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి పెన్నీ వాంగ్, జపాన్ విదేశాంగ మంత్రి తోషిమిత్సు మోటేగి కూడా పాల్గొననున్నారు. ఇండోపసిఫిక్ వ్యూహం, సముద్ర భద్రత, సరఫరా వ్యవస్థల బలోపేతం, కీలక ఖనిజాలు, కొత్త సాంకేతికతలు, ప్రాంతీయ పరిణామాలపై ప్రధానంగా చర్చలు జరిగే అవకాశం ఉంది.భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా సభ్యదేశాలుగా ఉన్న క్వాడ్ కూటమి ఇటీవలి కాలంలో ఇండోపసిఫిక్ ప్రాంతంలో కీలక వ్యూహాత్మక వేదికగా ఎదిగింది. రక్షణ, వాణిజ్యం, సాంకేతికత, మౌలిక వసతులు, ప్రాంతీయ భద్రత వంటి రంగాల్లో పరస్పర సహకారాన్ని ఈ కూటమి బలోపేతం చేస్తోంది. మార్కో రుబియో భారత్ పర్యటన సందర్భంగా ఇంధన సహకారం, రక్షణ భాగస్వామ్యం, వాణిజ్య సంబంధాలపై కూడా ద్వైపాక్షిక చర్చలు జరగనున్నట్లు సమాచారం. ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న వ్యూహాత్మక, ఆర్థిక సహకార అంశాలను సమీక్షించే అవకాశం ఉంది. ఇండోపసిఫిక్ ప్రాంతంలో పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, సరఫరా వ్యవస్థలపై ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆందోళనలు, చైనా విస్తరిస్తున్న ప్రభావం నేపథ్యంలో ఈ సమావేశానికి మరింత ప్రాధాన్యం ఏర్పడింది. "స్వేచ్ఛాయుత, స్వతంత్ర ఇండోపసిఫిక్" లక్ష్యాన్ని బలోపేతం చేయడంపై క్వాడ్ దేశాలు దృష్టి పెట్టనున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.ఇటీవలి అంతర్జాతీయ పరిణామాలు, అమెరికా-చైనా సంబంధాలు, పశ్చిమాసియా పరిస్థితుల నేపథ్యంలో ఢిల్లీ సమావేశం ప్రాధాన్యం మరింత పెరిగిందని దౌత్య పరిశీలకులు చెబుతున్నారు. ప్రాంతీయ భద్రత, అంతర్జాతీయ సవాళ్లపై కూడా సభ్యదేశాలు అభిప్రాయాలు పంచుకునే అవకాశం ఉంది.న్యూఢిల్లీతో పాటు కోల్‌కతా, ఆగ్రా, జైపూర్ నగరాలను కూడా మార్కో రుబియో సందర్శించే అవకాశం ఉందని సమాచారం. వ్యూహాత్మక, ఆర్థిక రంగాల్లో భారత్-అమెరికా సంబంధాలు మరింత బలోపేతం అవుతున్న నేపథ్యంలో ఈ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది.

# జూన్ 18న 26 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు



పలు రాష్ట్రాల్లో పోలింగ్.. కీలక నేతల పదవీకాలం ముగింపు

న్యూఢిల్లీ : దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన 26 రాజ్యసభ స్థానాల ఎన్నికలను భారత ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ స్థానాలకు జూన్ 18న పోలింగ్ నిర్వహించనున్నారు. ప్రస్తుత సభ్యుల పదవీకాలం ముగియడంతో పాటు రెండు స్థానాలకు ఉప ఎన్నికలు కూడా జరగనున్నాయి.రాజ్యసభలో పదవీకాలం ముగియనున్న ప్రముఖ నేతల్లో మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీనియర్ కాంగ్రెస్ నేత దిగ్విజయ్ సింగ్, కేంద్ర మంత్రి జార్జ్ కురియన్, బీజేపీ నేత రవ్నీత్ సింగ్ బిట్టూ ఉన్నారు.ఆంధ్రప్రదేశ్, గుజరాత్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, రాజస్థాన్, అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ, మిజోరం, మణిపూర్ రాష్ట్రాల్లోని స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. అదనంగా మహారాష్ట్ర, తమిళనాడులో సభ్యుల రాజీనామాల కారణంగా ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు.కర్ణాటకలో హెచ్‌డీ దేవెగౌడ, మల్లికార్జున ఖర్గే పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో అక్కడి ఎన్నికలపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. ప్రధాన రాజకీయ పార్టీలు తమ ప్రస్తుత బలం నిలుపుకుంటాయా అనే అంశంపై రాజకీయ వర్గాలు దృష్టి సారించాయి.ఈ ఎన్నికలు రాజ్యసభలో రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏకు స్వల్ప సంఖ్యా తగ్గుదల ఉండొచ్చని, కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష కూటమి బలం కొంత పెరిగే అవకాశం ఉందని అంచనాలు వ్యక్తమవుతున్నాయి. తమిళనాడులో నటుడురాజకీయ నాయకుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) వైఖరిపై కూడా రాజకీయ వర్గాలు దృష్టి పెట్టాయి. పార్టీ రాజ్యసభ రాజకీయాల్లో ఎంట్రీ ఇస్తుందా? అనే చర్చలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో పార్టీ నిర్ణయం రాష్ట్ర ప్రతిపక్ష రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.పార్లమెంట్ ఎగువసభగా ఉన్న రాజ్యసభ దేశ శాసన ప్రక్రియలో కీలక పాత్ర పోషిస్తుంది. అందువల్ల ఈ ఎన్నికలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ముఖ్యంగా కీలక బిల్లుల ఆమోదంలో రాజ్యసభ సంఖ్యాబలం ప్రభావం చూపే అవకాశముంది.



# 'పెద్ది'లోని ప్రోమోకు భారీ స్పందన

**రామ్ చరణ్, శృతి హాసన్, జాన్వీ కపూర్ ఎనర్జీతో సోషల్ మీడియాలో వైరల్**

రామ్ చరణ్ నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం "పెద్ది" నుంచి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రత్యేక గీతం "హెల్లల్లో" ప్రోమోను చిత్ర బృందం విడుదల చేసింది. విడుదలైన క్షణాల్లోనే ఈ ప్రోమో సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానుల్లో భారీ హైప్‌ను సృష్టిస్తోంది. రామ్ చరణ్, శృతి హాసన్, జాన్వీ కపూర్ కలిసి కనిపించిన ఈ స్పెషల్ సాంగ్ విజువల్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి.బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న "పెద్ది" ఇప్పటికే 2026లో అత్యంత ఆసక్తికర తెలుగు చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. గ్రామీణ క్రీడా నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రంలో రామ్ చరణ్ ప్రధాన పాత్ర పోషిస్తుండగా, జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. తాజాగా విడుదలైన "హెల్లల్లో" పాటలో శృతి హాసన్ ప్రత్యేక ఆకర్షణగా కనిపించారు.ప్రోమోలో రంగురంగుల సెట్లు, పండుగ వాతావరణం, భారీ డ్యాన్స్ మూవ్స్, మాస్ బీట్‌లు ప్రత్యేకంగా నిలిచాయి. ముఖ్యంగా రామ్ చరణ్–శృతి హాసన్ కెమిస్ట్రీ అభిమానులను ఆకట్టుకుంటోంది. వీరిద్దరి ఎనర్జిటిక్ డ్యాన్స్ మూవ్స్ సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి. మరోవైపు జాన్వీ కపూర్ గ్లామరస్ లుక్ కూడా ప్రత్యేక చర్చకు దారితీసింది.

ఈ పాటకు సంగీత మాంత్రికుడు ఏఆర్ రెహమాన్ సంగీతం అందించగా, అనంత శ్రీరామ్ సాహిత్యం రాశారు. గాయని రక్షిత సురేష్ ఆలపించిన ఈ పాటలో ఫాస్ట్ బీట్‌లు, జాతర వాతావరణం స్పష్టంగా కనిపిస్తున్నాయి. పూర్తి పాటను భోపాల్‌లో నిర్వహించే ప్రత్యేక సంగీత వేడుకలో విడుదల చేయనున్నట్లు సమాచారం.సోషల్ మీడియాలో ఈ ప్రోమోపై మిశ్రమ స్పందనలు కనిపిస్తున్నప్పటికీ చర్చ మాత్రం భారీగా సాగుతోంది. చాలామంది అభిమానులు రామ్ చరణ్ డ్యాన్స్, విజువల్స్, ఎనర్జీని ప్రశంసిస్తుండగా, మరికొందరు కొరియోగ్రఫీపై చర్చిస్తున్నారు. అయితే శృతి హాసన్ స్క్రీన్ ప్రెజెన్స్ మాత్రం ప్రోమోకు ప్రధాన హైలైట్‌గా నిలిచిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.ఇప్పటికే "పెద్ది" ట్రైలర్ విడుదల తర్వాత సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వృద్ధి సినిమాస్ నిర్మిస్తున్న ఈ చిత్రం జూన్ 4, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. "హెల్లల్లో" ప్రోమోతో సినిమాపై ఉన్న హైప్ మరింత పెరగడంతో, ఇప్పుడు అభిమానులు పూర్తి పాట విడుదల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# న్నో ఏళ్ల తర్వాత మళ్లీ కలుస్తున్న స్టార్ నటులు




బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం "కింగ్"పై రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా కేవలం స్టార్ కాస్ట్ వల్ల మాత్రమే కాకుండా, ఎన్నో ఏళ్ల తర్వాత పలు ప్రముఖ నటులు మళ్లీ ఒకే తెరపై కనిపించబోతుండటంతో ప్రత్యేక ఆకర్షణగా మారింది. దీంతో "కింగ్" ఇప్పుడు బాలీవుడ్ అభిమానులకు ఒక గ్రాండ్ రీయూనియన్ ఫెస్ట్‌గా మారింది. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న "కింగ్" 2026లో అత్యంత ఆసక్తికర హిందీ చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఈ చిత్రంలో షారుక్ ఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తుండగా, ఆయన కుమార్తె సుహానా ఖాన్ కూడా కీలక పాత్రలో కనిపించనున్నారు. తండ్రీ–కూతుళ్లు కలిసి పూర్తి స్థాయి కమర్షియల్ చిత్రంలో నటించడం ఇదే మొదటిసారి కావడంతో అభిమానుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది.అయితే ఈ సినిమాకు ప్రధాన హైలైట్‌గా మారింది పలు సీనియర్ నటులతో షారుక్ మళ్లీ కలవడం. ముఖ్యంగా అనిల్ కపూర్, జాకీ ష్రాఫ్‌లతో షారుక్ ఖాన్ మూడున్నర దశాబ్దాల తర్వాత మళ్లీ స్క్రీన్ షేర్ చేసుకోనున్నారు. వీరు గతంలో 1995లో వచ్చిన "త్రిమూర్తి" చిత్రంలో కలిసి నటించారు. ఇప్పుడు మళ్లీ ఈ ముగ్గురు ఒకే సినిమాలో కనిపించబోతుండటంతో 90ల బాలీవుడ్ అభిమానుల్లో భారీ నాస్టాల్జియా కనిపిస్తోంది.

ఇక షారుక్ ఖాన్–రాణి ముఖర్జీ జోడీ కూడా దాదాపు రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ ప్రేక్షకుల ముందుకు రానుంది. "కభీ అల్విదా నా కహనా", "పహేలీ", "వీర్ జారా", "చల్తే చల్తే" వంటి చిత్రాల్లో వీరిద్దరి కెమిస్ట్రీ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ఇప్పుడు మరోసారి ఈ జంట కలిసి కనిపించనుండటంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు."కింగ్" చిత్రంలో దీపికా పదుకొణె, అభిషేక్ బచ్చన్, అర్షద్ వార్సీ, జైదీప్ అహ్లావత్, అభయ్ వర్మ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ముఖ్యంగా అభిషేక్ బచ్చన్ ఈ చిత్రంలో ప్రధాన ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. దీంతో సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది.భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో హై వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలు, విదేశీ లొకేషన్లు, స్టైలిష్ విజువల్స్ ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయి. "పఠాన్", "వార్" వంటి భారీ యాక్షన్ బ్లాక్‌బస్టర్‌లను తెరకెక్కించిన సిద్ధార్థ్ ఆనంద్, "కింగ్"ను కూడా భావోద్వేగాలు కలిగిన స్టైలిష్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్నట్లు సమాచారం.ఇక సుహానా ఖాన్ పాత్ర కూడా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఓటీటీ ద్వారా నటిగా పరిచయమైన ఆమెకు, "కింగ్" పెద్ద తెరపై అసలైన లాంచ్‌గా భావిస్తున్నారు. తండ్రి షారుక్ ఖాన్‌తో కలిసి ఆమె ఎలా మెప్పిస్తారో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# 'పెద్ది' జాన్వీ కపూర్ గ్లామర్ ఇమేజ్‌ను మార్చగలదా?

## గ్రామీణ పాత్రలో కొత్తగా కనిపిస్తున్న బాలీవుడ్ నటి

బాలీవుడ్‌లో గ్లామరస్ పాత్రలు, స్టైలిష్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో గుర్తింపు తెచ్చుకున్న జాన్వీ కపూర్ ఇప్పుడు పూర్తిగా భిన్నమైన పాత్రతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న "పెద్ది" చిత్రం జాన్వీ కెరీర్‌లో కీలక మలుపు కావచ్చనే చర్చ ప్రస్తుతం సినీ వర్గాల్లో జరుగుతోంది.ఇప్పటివరకు జాన్వీ కపూర్ ఎక్కువగా గ్లామర్, ఫ్యాషన్, కమర్షియల్ పాత్రలకే పరిమితమయ్యారనే అభిప్రాయం ప్రేక్షకుల్లో ఉంది. అయితే "పెద్ది"లో ఆమె కనిపిస్తున్న తీరు మాత్రం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో జాన్వీ సంప్రదాయ దుస్తులు, సాధారణ మేకప్, సహజమైన లుక్‌తో కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా మారింది.సినిమాకు సంబంధించిన పోస్టర్లు, ప్రమోషనల్ వీడియోలు విడుదలైనప్పటి నుంచే జాన్వీ పాత్రపై చర్చ మొదలైంది. గ్లామర్‌కు దూరంగా, గ్రామీణ యువతిగా కనిపిస్తున్న ఆమె లుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది. దీంతో "పెద్ది" జాన్వీపై ఉన్న "గ్లామ్ డాల్" ఇమేజ్‌ను మార్చగలదా? అనే ప్రశ్న ఇప్పుడు సినీ వర్గాల్లో వినిపిస్తోంది.టాలీవుడ్ ప్రేక్షకులు ముఖ్యంగా గ్రామీణ భావోద్వేగ కథల్లో సహజ నటన, పాత్రలో ఒది
గి పో
యే ప్రదర్శనను ఎక్కువగా ఆశిస్తారు. ఈ నేపథ్యంలో "పెద్ది"లో జాన్వీ భావోద్వేగంగా ప్రేక్షకులను కనెక్ట్ చేయగలిగితే, ఆమె నటిగా కొత్త గుర్తింపు పొందే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. జాన్వీ కూడా గతంలో గ్లామరస్ పాత్రలకే పరిమితం కావాలని తనకు లేదని, కంటెంట్ ఆధారిత, సవాల్ విసిరే పాత్రలు చేయాలని ఆసక్తి ఉందని పలుమార్లు పేర్కొన్నారు. "మిలీ", "గుంజన్ సక్సేనా", "బవాల్" వంటి చిత్రాల్లో ఆమె తన నటనతో మెప్పించే ప్రయత్నం చేశారు. అయితే "పెద్ది" మాత్రం ఆమె కెరీర్‌లో ఇప్పటివరకు అతిపెద్ద పరీక్షగా భావిస్తున్నారు. మరోవైపు దర్శకుడు బుచ్చిబాబు సానా కథన శైలి కూడా జాన్వీకి ప్లస్ అవుతుందని సినీ వర్గాలు అంటున్నాయి. భావోద్వేగాలకు ప్రాధాన్యం ఇచ్చే కథలను తెరకెక్కించడంలో బుచ్చిబాబు ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. ఈ నేపథ్యంలో జాన్వీ పాత్ర కూడా కథలో బలమైన ప్రాధాన్యం కలిగి ఉండే అవకాశముందని భావిస్తున్నారు.సోషల్ మీడియాలో కూడా జాన్వీ కొత్త లుక్‌కు మంచి స్పందన వస్తోంది. గ్రామీణ నేపథ్యంలో ఆమె ఆశ్చర్యకరంగా బాగా సరిపోయారని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. రామ్ చరణ్ వంటి ఎనర్జిటిక్ నటుడితో కలిసి ఆమె ఎలాంటి నటన చూపిస్తారో చూడాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం, భారీ పాన్ ఇండియా స్థాయి అంచనాలు, రామ్ చరణ్ స్టార్‌డమ్—— all these factors "పెద్ది"ని జాన్వీ కెరీర్‌లో అత్యంత కీలక ప్రాజెక్ట్‌గా మార్చాయి. ఈ సినిమాలో ఆమె నటన ప్రేక్షకులను మెప్పిస్తే, జాన్వీ కపూర్ ఇమేజ్ పూర్తిగా మారిపోయే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# 'డ్రాగన్' తర్వాతే 'సలార్ 2' ప్రారంభం

**కీలక అప్‌డేట్ ఇచ్చిన దర్శకుడు ప్రశాంత్ నీల్**

ప్రభాస్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న "సలార్ 2" చిత్రంపై దర్శకుడు ప్రశాంత్ నీల్ కీలక అప్‌డేట్ ఇచ్చారు. "సలార్: పార్ట్ 2 – శౌర్యాంగ పర్వం" చిత్రాన్ని తన ప్రస్తుత చిత్రం "డ్రాగన్" పూర్తయ్యిన వెంటనే ప్రారంభిస్తానని ఆయన స్పష్టం చేశారు. దీంతో చాలా కాలంగా సోషల్ మీడియాలో జరుగుతున్న అనుమానాలు, ప్రచారాలకు తెరపడింది."సలార్: పార్ట్ 1 – సీజ్‌ఫైర్" భారీ క్లైమాక్స్ ట్విస్ట్‌తో ముగియడంతో రెండో భాగంపై అభిమానుల్లో విపరీతమైన ఆసక్తి నెలకొంది. అయితే గత కొన్ని నెలలుగా "సలార్ 2" ఆలస్యమవుతోందని, ప్రశాంత్ నీల్ ఇతర ప్రాజెక్టులతో బిజీ కావడంతో సినిమా వాయిదా పడే అవకాశముందని పలు వార్తలు వినిపించాయి. కొంతమంది సోషల్ మీడియాలో సినిమా రద్దవుతుందేమోనని కూడా చర్చించారు.తాజాగా జరిగిన ఒక ఇంటరాక్షన్‌లో ప్రశాంత్ నీల్ ఈ విషయంపై క్లారిటీ ఇచ్చినట్లు సమాచారం.



ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కుతున్న "డ్రాగన్" చిత్రంపై పూర్తి దృష్టి పెట్టిన ఆయన, ఆ సినిమా పూర్తయ్యాక వెంటనే "సలార్ 2" పనులు ప్రారంభిస్తానని తెలిపారు. దీంతో అభిమానుల్లో మళ్లీ ఉత్సాహం నెలకొందిఇప్పటికే "డ్రాగన్" చిత్రం భారీ అంచనాలు సృష్టిస్తోంది. జూనియర్ ఎన్టీఆర్‌ను పూర్తిగా కొత్త రగ్గడ్ లుక్‌లో చూపిస్తున్న ఈ యాక్షన్ చిత్రం టీజర్ విడుదల తర్వాత భారీ బజ్‌ను సంపాదించింది. ప్రశాంత్ నీల్‌కు ప్రత్యేక గుర్తింపైన మాస్ యాక్షన్ స్టైల్ మరోసారి కనిపించనుందని అభిమానులు భావిస్తున్నారు. మరోవైపు ప్రభాస్ కూడా వరుస పాన్ ఇండియా ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. అయినప్పటికీ "సలార్ 2"లో దేవా పాత్రకు తిరిగి సిద్ధమవుతున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కూడా "సలార్ 2" ఖచ్చితంగా తెరకెక్కుతుందని, మొదటి భాగంలో ప్రారంభమైన కథను కొనసాగిస్తామని వెల్లడించారు."సలార్" తొలి భాగం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించడమే కాకుండా ప్రత్యేకమైన ప్రపంచ నిర్మాణం, ఖాన్సార్ నేపథ్యం, యాక్షన్ సన్నివేశాలు, దేవా–వరద మధ్య భావోద్వేగ సంబంధంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ముఖ్యంగా క్లైమాక్స్ తర్వాత రెండో భాగంలో కథ ఎలా మలుపు తిరుగుతుందో తెలుసుకోవాలనే ఆసక్తి అభిమానుల్లో మరింత పెరిగింది.తాజా అప్‌డేట్ తర్వాత సోషల్ మీడియాలో అభిమానులు సంబరాలు జరుపుకుంటున్నారు. "సలార్ యూనివర్స్" తదుపరి అధ్యాయం కోసం ఎదురుచూస్తున్నామని కామెంట్లు చేస్తున్నారు. కొందరు అభిమానులు "కేజీఎఫ్" మరియు "సలార్" ప్రపంచాల మధ్య ఏదైనా కనెక్షన్ ఉంటుందా? అని కూడా ఊహాగానాలు చేస్తున్నారు. అయితే దీనిపై ప్రశాంత్ నీల్ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు."డ్రాగన్" వేగంగా షూటింగ్ జరుపుకుంటుండగా, ఆ తర్వాత "సలార్ 2" అధికారికంగా సెట్స్‌పైకి రానుండటంతో ప్రశాంత్ నీల్ రాబోయే చిత్రాలపై అంచనాలు మరింత పెరిగాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com